# భారత శక్తి®


Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 197 | హైదరాబాద్ | మంగళవారం 27-01-2026 | పేజీలు : 12 | వెల : 1.00



11లో

భారత్‌తో మాది చారిత్రక బంధం: రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలిపిన ట్రంప్


11లో

## పరేడ్ గ్రౌండ్స్‌లో
# ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు

- తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జెండా ఆవిష్కరించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం, మంత్రులు, స్పీకర్
- అసెంబ్లీ, మండలి, సచివాలయంలోనూ రిపబ్లిక్ డే సంబరాలు


11లో

## భిన్నత్వంలో ఏకత్వం..
# తలపాగాతో సందేశమిచ్చిన ప్రధాని

- 77వ గణతంత్ర వేడుకల్లో రాజస్థానీ తరహా తలపాగాతో ప్రధాని
- ఎరుపు రంగు టై-డై వస్త్రంపై బంగారు జరీ వర్క్‌తో ప్రత్యేక ఆకర్షణ
- ప్రతి ఏటా విభిన్న సంస్కృతులకు ప్రతీకగా తలపాగాలు ధరిస్తున్న మోదీ
- గతేడాది ఎరుపు, పసుపు రంగుల బాంధేజ్ తలపాగా ధరించిన ప్రధాని




11లో

## బంగ్లాదేశ్‌లో హిందువులపై పెరుగుతున్న దాడులు... చెప్పాపెట్టకుండా వచ్చేసిన ఎన్టీపీసీ ఇంజినీర్లు

- బంగ్లా హింసాత్మక దాడుల్లో పలువురు హిందువుల మృతి
- అకస్మాత్తుగా బంగ్లాను వీడిన 9 మంది ఎన్టీపీసీ ఇంజినీర్లు
- ఎన్నికల నేపథ్యంలో హింసాత్మక ఘటనలు మరింత పెరిగే అవకాశం

## అర్ధరాత్రి వేళ చెరువులో చిక్కుకుపోయిన వారిని
# కాపాడిన హైడ్రా-డీఆర్ఎఫ్

- మిరాలం చెరువులో చిక్కుకుపోయిన 9 మంది సిబ్బంది
- బోటు ఇంజన్ మొరాయించడంతో అర్ధరాత్రి ఉత్కంఠ
- రంగంలోకి దిగి సాహసోపేతంగా కాపాడిన హైడ్రాడీఆర్ఎఫ్ బృందాలు
- రెండు విడతల్లో బాధితులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన వైనం
- హైడ్రాడీఆర్ఎఫ్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపిన కార్మికులు



11లో


11లో

## బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయ ట్రస్ట్ కీలక నిర్ణయం..
# హిందూయేతరులకు ప్రవేశం బంద్

- ప్రతిపాదించిన ఆలయ కమిటీ బోర్డు
- త్వరలో జరగబోయే బోర్డు సమావేశంలో ప్రతిపాదనలకు ఆమోదం
- బోర్డు పరిధిలోకి వచ్చే ఇతర ఆలయాల్లోనూ ఇదే నిబంధన వర్తిస్తుందని వెల్లడి

## అమరావతిలో మొదటిసారిగా
# రిపబ్లిక్ డే వేడుకలు...

- అమరావతిలో తొలిసారి గణతంత్ర వేడుకలు జరగడంపై సీఎం చంద్రబాబు హర్షం
- ఈ రిపబ్లిక్ డే ఏపీ ప్రజలకు చిరస్మరణీయమని వ్యాఖ్య
- ప్రభుత్వ ఎజెండాను వివరించిన గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపిన సీఎం
- పరేడ్, శకటాల ప్రదర్శన భవిష్యత్ ఆకాంక్షలకు అద్దం పట్టాయన్న చంద్రబాబు




11లో





## వ్యాపారమే పరమావధి..
# ప్రాణాలకు లేదు రక్షాకవచం!

ఒక ఊరిలో ఒక వ్యాపారి ఉండేవాడు. తన మేడలో ఉన్న ఐశ్వర్యాన్ని కాపాడుకోవడానికి ఇంటి చుట్టూ దట్టమైన ఇనుప కంచె వేసుకున్నాడు. ఒకరోజు ఇంట్లో మంటలు చెలరేగాయి. ఆ ఇనుప కంచె దొంగలను రాకుండా ఆపింది కానీ, లోపల ఉన్న యజమానిని బయటకు రానివ్వలేదు. చివరకు తన స్వార్థమే తన ప్రాణానికి ముప్పుగా మారింది. నేడు భాగ్యనగరంలోని వాణిజ్య సముదాయాల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. యజమానుల కాసుల కక్కుర్తి, అధికారుల మామూళ్ల మత్తు వెరసి.. అమాయకుల ప్రాణాలు నిప్పుల కుంపటిలో కాలి బూడిదవుతున్నాయి. నాంపల్లి బచ్చాస్ ఫర్నీచర్ షోరూమ్ ప్రమాదం కేవలం 'యాక్సిడెంట్' కాదు.. అది వ్యవస్థ చేసిన 'నేరపూరిత హత్య

12లో

# గీతం చుట్టూ వివాదం...

విశాఖపట్టణం,భారత శక్తి ప్రతినిధి, జనవరి 26:

విశాఖపట్నంలోని గీతం విద్యా సంస్థలకు సంబంధించిన భూముల క్రమబద్ధీకరణ అంశం ప్రస్తుతం రాజకీయంగా, జనవరి 30, 2026న జరగనున్న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాన్ని అజెండాలో చేర్చడం వివాదానికి దారితీసింది. అది అప్పనంగా భూములు కట్టబెట్టడమేనని వైసీపీ సహా కొంత మంది సామాజికవేత్తలు ఆరోపణలు చేస్తున్నారు. అయితే ఇవి తమకు గతంలో కేటాయించినవేనని గీతం అంటోంది. సుమారు 54.79 ఎకరాల ప్రభుత్వ భూమిని క్రమబద్ధీకరించాలని జీవీఎంసీ ప్రతిపాదించింది. విశాఖలోని అత్యంత ఖరీదైన రుషికొండ, ఎండాడ గ్రామాల్లోని సర్వే నంబర్లు 17/1, 17/28 వంటి చోట్ల ఈ భూములు ఉన్నాయి. గీతం సంస్థ 1980లలో స్థాపించబడింది. అప్పటి నుంచి వివిధ దశల్లో ప్రభుత్వం కేటాయించిన భూములతో పాటు, మరికొంత భూమిని సంస్థ తన అధీనంలో ఉంచుకుందన్న ఆరోపణలు ఉన్నాయి. సుమారు 4 దశాబ్దాలుగా ఈ భూములు ఆ సంస్థ ఆధీనంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ భూముల చుట్టూ ఉన్న వివాదం ప్రధానంగా మూడు అంశాలపై ఆధారపడి ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో , గీతం సంస్థ సుమారు 40 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని ఆక్రమించిందని ఆరోపిస్తూ రెవెన్యూ అధికారులు కొన్ని ప్రహరీ గోడలను కూల్చివేసి, భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఆ భూములకు కంచె వేసి ప్రభుత్వ భూమి అని బోర్డులు కూడా పెట్టారు. అక్కడ ప్రస్తుతం భూముల విలువ భారీగా పెరిగింది. విలువైన భూమిని ఒక ప్రైవేట్ సంస్థకు తక్కువ ధరకే లేదా ఉచితంగా క్రమబద్ధీకరించడంపై మాజీ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ వంటి మేధావులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, విద్యా సంస్థల అవసరాల దృష్ట్యా ఈ భూములను క్రమబద్ధీకరించాలని భావిస్తోంది. దీనిని జీవీఎంసీ కౌన్సిల్ అజెండాలో 15వ అంశంగా చేర్చారు. కౌన్సిల్ ఆమోదం పొందితే, ప్రభుత్వం నిర్ణయించిన క్రమబద్ధీకరణ ఫీజు చెల్లించి గీతం సంస్థ ఈ భూములను అధికారికంగా పొందవచ్చు.గీతం విద్యాసంస్థల యాజమాన్యం తమపై వస్తున్న ఆక్రమణ ఆరోపణలను మొదటి నుంచి ఖండిస్తూనే ఉంది. సంస్థ ప్రతినిధుల ప్రకారం, గీతం క్యాంపస్ ఉన్న భూమిలో మెజారిటీ భాగం 1980వ దశకంలో అప్పటి ప్రభుత్వం నుంచి అధికారికంగా కేటాయించింది. విద్యాసంస్థల విస్తరణ కోసం అప్పట్లో భూములను ప్రభుత్వం కేటాయించిందని, తాము నిబంధనలకు విరుద్ధంగా ఏదీ నిర్మించలేదని వారు వాదిస్తున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించినప్పుడు, గీతం యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. ఆ భూములకు సంబంధించి తమ వద్ద తగిన పత్రాలు ఉన్నాయని వారు కోర్టుకు సమర్పించారు. అధికారులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేతలు చేపట్టారని, ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని వారు వాదించారు. గీతం ఒక లాభాపేక్ష లేని విద్యాసంస్థగా, వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తోందని వారి వాదన. క్యాంపస్‌లో ఉన్న ఖాళీ స్థలాలు లేదా వివాదాస్పదంగా మారిన భూములు కూడా క్రీడా మైదానాలుగా, విద్యా సంబంధిత సౌకర్యాల కోసమే వాడుతున్నామని వారు చెబుతున్నారు. దశాబ్దాల కాలంగా సంస్థ ఆధీనంలో ఉన్న భూములను ఇప్పుడు ఆక్రమణలుగా పరిగణించడం సరికాదని వారి అభిప్రాయం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏదైనా సాంకేతిక కారణాల వల్ల భూమి కేటాయింపులో లోపాలు ఉంటే, ప్రస్తుత ప్రభుత్వ జీవోల ప్రకారం నిర్ణీత రుసుము చెల్లించి ఆ భూములను క్రమబద్ధీకరించుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని సంస్థ గతంలోనూ సూచించింది. గీతం సంస్థ వాదన ప్రకారం, వారు ఏ భూమినీ ఉద్దేశపూర్వకంగా ఆక్రమించలేదు. 40 ఏళ్లుగా విద్యా సేవలు అందిస్తున్న సంస్థపై రాజకీయ కారణాలతోనే ఆరోపణలు వస్తున్నాయని, చట్టపరంగా తమకు హక్కులు ఉన్నాయని వారంటున్నారు. గీతం యాజమాన్యం రాజకీయ కుటుంబం. ప్రస్తుతం విశాఖ ఎంపీగా ఉన్న భరత్ విద్యాసంస్థ వ్యవహారాలు చూస్తున్నారు. మాజీ ఎంపీ ఎంవీవీఎస్ మూర్తి మనవడు భరత్. ఆయన బాలకృష్ణ అల్లుడు కూడా. అంటే సీఎం చంద్రబాబుకు సమీప బంధువే. రాజకీయ కుటుంబం కావడంతో ఈ వ్యవహారంపై మరిన్ని ఆరోపణలు వస్తున్నాయి. ఆ భూములు దశాబ్దాలుగా విద్యా సంస్థ అవసరాలకు వాడుతున్నా ఆ విషయం ఎక్కడా బయటకు రాకుండా ఆరోపణలు చేస్తున్నారని భరత్ వర్గీయులు అంటున్నారు. మొత్తానికి ఈ వివాదం రాజకీయ మలుపులు తిరగడం ఖాయంగా కనిపిస్తోంది.

## రాష్ట్రాలతో గవర్నర్ల పంచాయితీ

దక్షిణాది రాష్ట్రాల్లో ప్రస్తుతం గవర్నర్ల తీరుపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. కేంద్ర-రాష్ట్ర సంబంధాల మధ్య వారధిగా ఉండాల్సిన గవర్నర్లు, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలతో ఢీ అంటే ఢీ అనే స్థాయికి వెళ్లడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆందోళన కలిగిస్తోంది. భారత రాజ్యాంగం ప్రకారం రాష్ట్రానికి అధిపతి గవర్నర్. కానీ, అధికారం మాత్రం ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వానిదే. అయితే ఇటీవల కాలంలో ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, కర్ణాటకలలో గవర్నర్లు అనుసరిస్తున్న తీరు రాజ్యాంగ సంప్రదాయాలను తుంగలో తొక్కేలా ఉందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పుకు గౌరవం ఇవ్వాల్సిన స్థానంలో ఉన్న వ్యక్తులు, రాజకీయ ఏజెంట్లుగా మారుతున్నారా? అనే సందేహాలు కలగక మానవు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 176(1) ప్రకారం, ప్రతి ఏటా మొదటి అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగించడం ఒక తప్పనిసరి ప్రక్రియ. ఈ ప్రసంగం గవర్నర్ వ్యక్తిగత అభిప్రాయం కాదు అది ప్రభుత్వం రూపొందించిన విధాన పత్రం. కానీ, ప్రస్తుత గవర్నర్లు ఈ సంప్రదాయానికి తూట్లు పొడుస్తున్నారు. తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి జాతీయ గీతం అంశాన్ని తెరపైకి తెచ్చి అసెంబ్లీ నుంచి వాకౌట్ చేయడం చర్చనీయాంశమైంది. రాష్ట్ర సంస్కృతిని ప్రతిబింబించే 'తమిళ్ తాయి వాల్తు' విషయంలో ఆయన వ్యవహరించిన తీరు రాష్ట్ర ప్రభుత్వ హక్కులను ప్రశ్నించడమే అవుతుంది. తమిళనాడు అసెంబ్లీ సమావేశాలను ప్రారంభించి ప్రసంగించాల్సిన గవర్నర్ మధ్యలోనే వెళ్లిపోయారు. సభలో జాతీయ గీతం పాడాలని కోరినా సభాపతి వినిపించుకోలేదని లోక్‌భవన్ వెల్లడించింది. దేశంలోని అన్ని శాసన సభలలో గవర్నర్ ప్రసంగానికి ముందు జాతీయ గీతాలాపన చేయడం సంప్రదాయంగా కొనసాగుతోందని, స్టాలిన్ సర్కారు మాత్రం ఈ సంప్రదాయాన్ని బ్రేక్ చేస్తోందని పేర్కొంది. దీనికి నిరసనగా గవర్నర్ ఆర్.ఎన్.రవి అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసినట్లు సమాచారం.కేరళ మాజీ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, ప్రస్తుత గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ఇప్పుడు ప్రసంగంలోని కొన్ని భాగాలను కావాలనే వదిలేయడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించే అంశాలు ఉండకూడదనే నెపంతో ప్రభుత్వం పంపిన స్క్రిప్ట్‌ను ఎడిట్ చేయడం రాజ్యాంగ విరుద్ధం. తాజాగా కర్ణాటక గవర్నర్ తావర్ చంద్ గెహ్లాట్ కూడా ఇదే బాట పట్టారు. కేంద్రంపై విమర్శలు ఉన్న భాగాలను దాటవేస్తూ ఆయన ప్రసంగించడం, రాష్ట్ర ప్రభుత్వంపై తన ఆధిపత్యాన్ని ప్రదర్శించడమేనని విశ్లేషకులు భావిస్తున్నారు.రాజ్యాంగ పరిషత్ చర్చల్లో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గవర్నర్ల పాత్రను చాలా స్పష్టంగా వివరించారు. గవర్నర్‌కు సొంతంగా నిర్ణయాలు తీసుకునే అధికారం చాలా పరిమితమని, రాష్ట్ర మంత్రిమండలి సూచనల మేరకే ఆయన నడుచుకోవాలని స్పష్టం చేశారు. సాధారణంగా రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించిన ప్రసంగ పాఠాన్ని గవర్నర్ చదవడం ఆనవాయితీ. అయితే, గురువారం సభకు వచ్చిన గవర్నర్ గహ్లోత్ ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రతిని పక్కన పెట్టారు. "ఈ రాష్ట్రం ప్రగతి మార్గంలో నడుస్తోంది.. సమావేశాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నా" అని కేవలం రెండు లైన్లు మాత్రమే చదివి సభ నుండి వెళ్లిపోయారు. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించే అంశాలు ప్రసంగంలో ఉండటం పట్ల ఆయన ముందుగానే అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.గవర్నర్ తీరుపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తీవ్రంగా స్పందించారు. క్యాబినెట్ నిర్ణయాలను గౌరవించకుండా గవర్నర్ రాజ్యాంగ వ్యతిరేక చర్యకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం తయారు చేసిన ప్రసంగాన్ని కాదని, ఆయన సొంతంగా సిద్ధం చేసుకున్న వ్యాఖ్యలు చేయడం చెల్లదని పేర్కొన్నారు. దీనిపై న్యాయ నిపుణులతో చర్చిస్తున్నామని, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని సీఎం స్పష్టం చేశారు. గత రెండేళ్లుగా ప్రభుత్వం ఇచ్చిన ప్రసంగాలను యథావిధిగా చదివిన గవర్నర్, ఈసారి వ్యూహాత్మక మార్పు చేయడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. కేంద్ర-రాష్ట్ర సంబంధాల విషయంలో గవర్నర్ కార్యాలయం రాజకీయ వేదికగా మారుతోందని వారు విమర్శిస్తున్నారు. ఈ పరిణామంతో కర్ణాటకలో పాలక పక్షం, గవర్నర్ మధ్య ఉన్న సంబంధాలు మరింత క్షీణించే అవకాశం కనిపిస్తోంది.బ్రిటిష్ పార్లమెంటరీ విధానంలోని "ది కింగ్ కెన్ డు నో రాంగ్" అనే సూత్రం ఇక్కడ వర్తిస్తుంది. అంటే ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగంలో తప్పులున్నా, ఒప్పిదాలున్నా దానికి బాధ్యత ప్రభుత్వానిదే తప్ప గవర్నర్ది కాదు. కాబట్టి, దానిని యథాతథంగా చదవడం గవర్నర్ బాధ్యత. గవర్నర్లు తమకు నచ్చిన పేరాలను చదివి, నచ్చనివి వదిలేయడం వల్ల సభలో జరిగే ధన్యవాద తీర్మానంపై చర్చ అసంపూర్ణంగా మారుతుంది. ప్రభుత్వం ఏయే అంశాలను ప్రజల ముందుకు తీసుకెళ్లాలని భావిస్తుందో, వాటిని గవర్నర్ అడ్డుకోవడం అంటే పరోక్షంగా ప్రజాతీర్పును అడ్డుకోవడమే.గవర్నర్ వ్యవస్థ అనేది కేంద్రం, రాష్ట్రాల మధ్య సమన్వయం కోసం ఉండాలి కానీ, రాష్ట్ర ప్రభుత్వాల పనులకు ఆటంకం కలిగించే స్పీడ్ బ్రేకర్ లా మారకూడదు. గవర్నర్లు ఒక రాజకీయ పార్టీ ప్రతినిధులుగా కాకుండా, రాజ్యాంగ రక్షకులుగా వ్యవహరించాలి. సుప్రీంకోర్టు సైతం గతంలో పలు సందర్భాల్లో గవర్నర్ల పరిధిని గుర్తు చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలతో ఘర్షణ పడటం వల్ల అభివృద్ధి కుంటుపడటమే కాకుండా, సమాఖ్య స్ఫూర్తి దెబ్బతింటుంది. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్నవారు వ్యక్తిగత, రాజకీయ ఎజెండాలను పక్కన పెట్టి, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# క్రాస్ రోడ్స్ లో జగన్ ..

## సజ్జల వైపా, విజయసాయి వైపా..

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, జనవరి 26:

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కోటరీ రగడ ఇప్పుడు బహిరంగ చర్చకు వచ్చేసింది. పార్టీ ఆవిర్భావం నుండి జగన్ వెన్నంటే ఉండి, 2019 విజయపథంలో కీలక పాత్ర పోషించిన విజయసాయిరెడ్డి, ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీకి , జగన్‌కు దూరమయ్యారు. కానీ తాను జగన్ కోసం పని చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఆయన సంకేతాలు పంపుతున్నారు. కాకపోతే ప్రస్తుతం ఉన్న సజ్జల కోటరీని బయటకు పంపాలంటున్నారు. దీంతో జగన్ కు ఇప్పుడు కొత్త ఆలోచనలు వచ్చే అవకాశం ఉంది. ఒకప్పుడు జగన్ 'ఏ-2'గా, పార్టీకి వెన్నెముకగా భావించిన విజయసాయిరెడ్డి ఇప్పుడు దూరమయ్యారు. అయితే తాను జగన్‌కు దూరం కాలేదని, తనను జగన్ నుండి ప్రస్తుతం ఉన్న కోటరీ సభ్యులే దూరం చేశారని ఆయన బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి సహా ప్రస్తుతం జగన్ చుట్టూ ఉన్న వారికి కనీస రాజకీయ పరిజ్ఞానం లేదని, వారు జగన్‌ను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన విమర్శించడం పార్టీలో ఉన్న తీవ్ర విభేదాలను సూచిస్తోంది. తనను తిరిగి పార్టీ బాధ్యతల్లోకి తీసుకుంటే కూటమిని విడగొట్టి, జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెడతానని ఆయన చేస్తున్న ప్రకటన వైసీపీ శ్రేణుల్లో కొత్త ఆశలను రేకెత్తిస్తోంది.వైసీపీ క్షేత్రస్థాయి క్యాడర్‌లో విజయసాయిరెడ్డి పట్ల సానుకూలత కనిపిస్తోంది. 2019 ఎన్నికల సమయంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసి, బూత్ స్థాయి వరకు యంత్రాంగాన్ని నడిపించిన ఘనత విజయసాయిరెడ్డిదేనని మెజారిటీ కార్యకర్తలు నమ్ముతున్నారు. అదే సమయంలో 2024 ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయానికి సజ్జల రామకృష్ణారెడ్డి నేతృత్వంలోని కోటరీ అనుసరించిన అతి విశ్వాసం, కార్యకర్తలకు నేతలను దూరం చేసిన తీరే కారణమని క్యాడర్ బలంగా విశ్వసిస్తోంది. క్షేత్రస్థాయి పరిస్థితులను జగన్ దృష్టికి వెళ్లకుండా అడ్డుకున్నారనే అపవాదు సజ్జల కోటరీపై బలంగా పడింది.ప్రస్తుతం జగన్ మోహన్ రెడ్డి ఒక కీలకమైన కూడలిలో ఉన్నారు. ఆయన ముందు ప్రధానంగా రెండు మార్గాలు కనిపిస్తున్నాయి: ఒకటి, గడిచిన ఐదేళ్లుగా తన వెన్నంటే ఉండి, పార్టీ విధానాలను నడిపించిన సజ్జల. ప్రస్తుత కోటరీనే నమ్ముకుని ముందుకు సాగడం. రెండు, పాత మిత్రుడిని, వ్యూహకర్తను విశ్వసించి విజయసాయిరెడ్డికి మళ్లీ పగ్గాలు అప్పగించడం. అయితే, జగన్ సాధారణంగా తాను నమ్మిన వారిని వదులుకోవడానికి ఇష్టపడరని, కానీ ఇప్పుడు పార్టీ ఉనికికే ప్రమాదం ఏర్పడిన తరుణంలో ఆయన తన పంథాను మార్చుకుంటారా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.విజయసాయిరెడ్డి ఢిల్లీ స్థాయిలో చక్రం తిప్పడమే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నాయకులతో వ్యక్తిగత సంబంధాలను కలిగి ఉన్నారు. ఆయనను పక్కన పెట్టడం వల్ల ఉత్తరాంధ్రతో పాటు పలు జిల్లాల్లో పార్టీ పట్టు కోల్పోయిందనే వాదన ఉంది. మరోవైపు, సజ్జల రామకృష్ణారెడ్డి అన్ని విభాగాలను ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నం చేసినప్పటికీ, అది కేవలం పాలనాపరమైన సలహాలకే పరిమితమైందని, రాజకీయ వ్యూహాల్లో ఆయన విఫలమయ్యారని పార్టీలోని ఒక వర్గం భావిస్తోంది. ఇప్పుడు విజయసాయిరెడ్డి నేరుగా సవాల్ విసురుతున్నందున జగన్ ఎవరి వైపు మొగ్గు చూపుతారనేది ఆసక్తికరంగా మారింది.ప్రస్తుతం ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అత్యంత పటిష్టంగా ఉంది. ఇటువంటి బలమైన ప్రత్యర్థిని ఎదుర్కోవాలంటే కేవలం సామాజిక సమీకరణాలు మాత్రమే సరిపోవని, రాజకీయంగా చీలికలు తెచ్చే పక్కా వ్యూహాలు అవసరమని విజయసాయిరెడ్డి అభిప్రాయపడుతున్నారు. ఆయనకు ఉన్న పాత నెట్‌వర్క్, రాజకీయ చాణక్యం ఇప్పుడు పార్టీకి అవసరమని క్యాడర్ కోరుకుంటోంది. జగన్ తన కోటరీని ప్రక్షాళన చేయకుండా కేవలం ప్రజల్లోకి వెళ్తే ఫలితం ఉండదని, లోపల వ్యవస్థను మార్చాలని కోరుకుంటున్నారు. రాబోయే రోజుల్లో జగన్ కోటరీలో మార్పులు జరిగే అవకాశాలను కొట్టిపారేయలేం. ఒకవేళ విజయసాయిరెడ్డిని జగన్ ఆహ్వానిస్తే సజ్జల కోటరీ బయటకు పోవాల్సి ఉంటుంది. జగన్ ఇప్పటికీ మౌనంగానే ఉంటూ పరిణామాలు గమనిస్తున్నారు. విజయసాయిరెడ్డి చేస్తున్న ప్రతిపాదన జగన్ హృదయాన్ని గెలుచుకుంటుందా లేక కోటరీ గోడలకు తగిలి వెనక్కి వస్తుందా అనేది వేచి చూడాలి.

# మహిళలకు బడ్జెట్ కేటాయింపులు ఎప్పుడు

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, జనవరి 26:

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుపై మరింత దృష్టి పెట్టినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎన్నికల సమయంలో "సూపర్ సిక్స్" హామీలతో ప్రజల ముందుకు వెళ్లిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని హామీలను ఇప్పటికే అమలు చేస్తోంది. ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం , ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలు మహిళలకు ప్రత్యక్షంగా లాభం చేకూరుస్తున్నాయి. అయితే ఈ హామీల్లో కీలకమైన ఆడబిడ్డ నిధి పథకం అమలుపై ఇప్పటివరకు స్పష్టత లేకపోవడంతో విమర్శలు పెరిగాయి.రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం వల్ల ఈ పథకం ఆలస్యం అవుతోందని ప్రభుత్వం ఇప్పటివరకు వివరణ ఇచ్చింది. అయినా కూడా ప్రతిపక్షాల నుంచి ఒత్తిడి పెరగడం, లబ్ధిదారులైన మహిళల్లో ఆశలు ఎక్కువ కావడంతో ప్రభుత్వం ఇప్పుడు ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసు ఉన్న మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున అందిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. ఈ మొత్తాన్ని అమలు చేయాలంటే ప్రభుత్వ ఖజానాపై భారీ భారం పడనుంది. అయినా రాజకీయంగా, సామాజికంగా ఈ పథకం ప్రాధాన్యం ఎక్కువగా ఉండటంతో అమలు తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఎన్నికలు ముగిసి దాదాపు 20 నెలలు గడవడం, త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండటం కూడా ప్రభుత్వ నిర్ణయంపై ప్రభావం చూపినట్లు చెబుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచే ఆడబిడ్డ నిధిని ప్రారంభించాలన్న ఆలోచనతో ఉన్నతస్థాయి చర్చలు జరిగాయని ప్రచారం. నెలనెలా నగదు జమ చేయాలా? లేక సంవత్సరానికి ఒకసారి మొత్తంగా ఇవ్వాలా? అనే అంశాలపై అధికారులు అధ్యయనం చేస్తున్నట్లు సమాచారం. పథకం అమలుకు అవసరమైన మార్గదర్శకాలు, అర్హతలపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాలు ఈ విషయంలో కీలకంగా మారనున్నాయి. ఫిబ్రవరి 14న అసెంబ్లీలో వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఆర్థిక బడ్జెట్‌తో పాటు వ్యవసాయ, ఇరిగేషన్ రంగాలకు ప్రత్యేక కేటాయింపులు ఉండనున్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో సంక్షేమ కార్యక్రమాలకు కూడా పెద్దపీట వేయనున్నట్లు సమాచారం. తల్లికివందనం, అన్నదాత సుఖీభవ, ఉపాధి కల్పన వంటి హామీల అమలుపై ప్రభుత్వం చిత్తశుద్ధిగా పనిచేస్తోందని మంత్రులు చెబుతున్నారు. ఆడబిడ్డ నిధిపై బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయనే నమ్మకం ప్రజల్లో పెరుగుతోంది. అయితే కేటాయింపులు చేసినా, వాస్తవంగా ఎప్పటి నుంచి అమలు చేస్తారన్నదే ఇప్పుడు ప్రధాన ఉత్కంఠ. బడ్జెట్ ప్రకటనతో ఈ సందేహాలకు తెరపడుతుందా? లేదంటే మరోసారి ఎదురుచూపులేనా? అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది.

# ట్యాక్స్ లో భారీ మార్పులు

## ఆప్షనల్ జాయింట్ టాక్సేషన్

న్యూఢిల్లీ,భారత శక్తి ప్రతినిధి, జనవరి 26:

మరికొద్ది రోజుల్లో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ను ప్రవేశపెట్టబోతోంది.. ఇప్పటికే బడ్జెట్ కు సంబంధించిన కేటాయింపులు.. ఇతర వ్యవహారాలు పూర్తయినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జాతీయ మీడియాలో బడ్జెట్ కు సంబంధించి ఒక కథనం ప్రసారమవుతోంది.ఈసారి బడ్జెట్లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కొత్త పన్ను విధానాన్ని తెరపైకి తీసుకొస్తున్నట్టు తెలుస్తోంది. మనదేశంలో పన్ను వ్యవస్థను మరింత సులభతరం చేయాలనే ఉద్దేశంతో 2020 నుంచి అనేక రకాల మార్పులు తీసుకొస్తున్నారు. 2026 బడ్జెట్లో మాత్రం వివాహితుల కోసం కేంద్ర ప్రభుత్వం సరికొత్తగా "ఆప్షనల్ జాయింట్ టాక్సేషన్ ను తెరపైకి తీసుకురానుంది. ఇప్పటివరకు భార్యాభర్తలు ఒకవేళ ఇద్దరు ఉద్యోగస్తులై.. లేదా భారీగా సంపాదించే వాళ్ళు అయితే.. వారు విడివిడిగా ప్రభుత్వానికి ట్యాక్స్ లు చెల్లిస్తున్నారు. 2026 బడ్జెట్లో మాత్రం కేంద్రం కొత్త ప్రతిపాదన తీసుకొస్తోంది. ఆలూ మగలను ఆర్థిక యూనిట్ గా పరిగణిస్తోంది. భార్యాభర్తలు ఇద్దరు సంపాదిస్తే.. దానిని వారిద్దరూ తమ ఉమ్మడి ఆదాయంగా ప్రకటించవచ్చు. దానిపై పన్ను ను చెల్లించవచ్చు. ఇప్పటికే అభివృద్ధి చెందిన దేశాలలో ఈ విధానం అమల్లో ఉంది. మన దేశంలో కూడా ఇలాంటి విధానాన్ని అమలు చేస్తే పన్ను చెల్లించే వారు తమ ఆర్థిక ప్రణాళికను మరిత సమర్థవంతంగా రూపొందించుకోవడానికి అవకాశం ఉంటుంది.ఈ విధాన గనక అమలులోకి వస్తే భార్యాభర్తల ఉమ్మడి పన్ను మినహాయింపు పరిమితి పెరుగుతూ ఉంటుంది. విడివిడిగా ఉన్నప్పుడు లభించే మినహాయింపుల కంటే.. సంయుక్తంగా ఫైల్ చేసినప్పుడు ఒకేసారి భారీగా మినహాయింపు లభిస్తుంది. దీనివల్ల దంపతుల మీద పన్ను భారం తగ్గుతుంది.

# యువత ఓటు హక్కు వినియోగించుకోవాలి : తహసీల్దార్ ప్రవీణ్ కుమార్.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 26 (భారత శక్తి): భైంసా జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా భైంసాలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ యువతకు ప్రత్యేక పిలుపునిచ్చారు. "నేను భారతీయుడిని -- నా ఓటే నా బలం" అనే భావన ప్రతి ఒక్కరిలో ఉండాలని అన్నారు.

కేజీబీవీ హాస్టల్ నుండి మండల ప్రజాపరిషత్




కార్యాలయం వరకు జరిగిన ర్యాలీలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన ప్రతిజ్ఞా కార్యక్రమంలో ఓటు విలువపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో ఓటు ప్రాధాన్యతను పెంపొందించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సుభాష్ .డిప్యూటీ తహసీల్దార్ ముత్యం,ఆర్?ఐలు రఘురాం, దత్తు తదితరులు పాల్గొన్నారు.

# ఫర్నిచర్ షాపులో అడుగడుగునా ఉల్లంఘనలు

హైదరాబాద్,భారత శక్తి ప్రతినిధి, జనవరి 26:

హైదరాబాద్ నాంపల్లిలో ఉన్న బచ్చాస్ ఫర్నిచర్ దుకాణంలో శనివారం చోటుచేసుకున్న భారీ అగ్ని ప్రమాదం పెను విషాదాన్ని మిగిల్చింది. ఈ దుకాణంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న యాదయ్య, లక్ష్మి దంపతుల కుమారులు అఖిల్, ప్రణీత్ మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగిన సమయంలో దట్టమైన పొగ, మంటలు చుట్టుముట్టడంతో ఆ చిన్నారులు గది మూలకు వెళ్లి దాక్కున్నారు. కానీ, గాలి ఆడని స్థితిలో పొగకు ఊపిరాడక వారు అక్కడికక్కడే నిర్జీవంగా పడిపోయారు. అయితే ఆ రోజు బడికి పిల్లలు బతికేవాళ్లేనట. 'అయ్యో దేవుడా.. బడికి వెళ్తే నా బిడ్డలు బతికేవాళ్లు' అంటూ ఆ తల్లిదండ్రులు ఉస్మానియా ఆసుపత్రి వద్ద గుండెలవిసేలా రోదిస్తున్న తీరు అక్కడి వారిని కన్నీరు పెట్టించింది. ఈ ప్రమాదంలో కేవలం చిన్నారులే కాకుండా.. వారిని కాపాడేందుకు ప్రాణాలకు తెగించి లోపలికి వెళ్ళిన సేల్స్‌మ్యాన్ మహ్మద్ ఇంతియాజ్, ఆటో డ్రైవర్ సయ్యద్ హబీబ్, మరో మహిళ బేబీ కూడా మృత్యువాత పడ్డారు. వాస్తవానికి ఆ ఫర్నిచర్ దుకాణంలోని సెల్లార్ ఒక మృత్యుకుహరాన్ని తలపించింది. వాహనాల పార్కింగ్ కోసం కేటాయించాల్సిన సెల్లార్‌ను యజమాని పూర్తిగా ఫర్నిచర్, ప్రమాదకరమైన రసాయనాలతో నింపేశారు. కేవలం ఒక్క మనిషి మాత్రమే వెళ్లగలిగే సందు మినహా, లోపల ఎటు చూసినా సామగ్రి అడ్డదిడ్డంగా ఉండటంతో మంటలు వ్యాపించినప్పుడు బాధితులు బయటకు వచ్చే దారి దొరకక లోపలే చిక్కుకుపోయారు. ప్రమాదానికి గల కారణాలపై అబిడ్స్ ఏసీపీ ప్రవీణ్ కుమార్ స్పందిస్తూ.. ప్రాథమిక దర్యాప్తులో షార్ట్ సర్క్యూట్ వల్లే




మంటలు అంటుకున్నట్లు గుర్తించామన్నారు. అగ్నిమాపక వాహనాలు ఘటన జరిగిన 25 నిమిషాల్లోనే చేరుకున్నప్పటికీ.. సెల్లార్‌లోని గ్రిల్స్, షట్టర్లకు తాళాలు వేసి ఉండటం వల్ల లోపలికి వెళ్లడం కష్టతరమైందని తెలిపారు. నిబంధనలను అతిక్రమించి సెల్లార్‌ను గోదాంగా మార్చినందుకు గానూ, వాచ్‌మెన్ యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు యజమాని సతీశ్ బచ్చాపై పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. జేఎన్‌టీయూ నిపుణుల బృందం ప్రమాద స్థలాన్ని సందర్శించి భవనం పటిష్టతను, ప్రమాద తీవ్రతను పరిశీలించింది. జీహెచ్ఎంసీ మరియు అగ్నిమాపక శాఖ ఇచ్చే తుది నివేదికల ఆధారంగా తదుపరి కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. లాభాల కోసం యజమానులు చేసే చిన్న పొరపాట్లు, సామాన్య పేద కుటుంబాల జీవితాలను ఎలా బుగ్గిపాలు చేస్తాయనడానికి ఈ నాంపల్లి ఘటనే నిదర్శనం.

# సింహం సింగిల్ అంటున్న కవిత

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జనవరి 26:



కల్వకుంట్ల కవిత.. భారత రాష్ట్ర సమితి మాజీ నాయకురాలు, మాజీ ఎమ్మెల్సే. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ముద్దుల కూతురు. పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నంతకాలం పదవులు అనుభవించిన కవిత.. అధిష్టానం ప్రభుత్వం ఏం చేసినా మిన్నకున్నారు. అధికారం పోగానే, పార్టీలోని గ్రూపు రాజకీయాలు.. తనకు ప్రాధాన్యం దక్కడం లేదన్న విషయం గుర్తొచ్చింది. దీంతో హరీశ్‌రావు, సంతోష్‌రావు టార్గెట్‌గా సొంత పార్టీ నేతలపై విమర్శలు చేశారు. అన్న కేటీఆర్ తీరును తప్పు పట్టారు. దీంతో అధిష్టానం కేసీఆర్ ఆదేశాల మేరకు కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. దీంతో తెలంగాణ జాగృతి పేరుతో రాజకీయాలు చేస్తున్నారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా ఆమోదించాలని కోరుతూ చేసిన ప్రసంగంలో బాధతో వెళ్తున్నానని, ప్రజల్లో గెలిచి వస్తానని ప్రకటించారు. ఈ క్రమంలోనే కొత్త రాజకీయ పార్టీ పెడతానని క్లారిటీ ఇచ్చారు. తండ్రి కేసీఆర్ టీఆర్ఎస్ స్థాపించిన మొదట్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి అప్పటి వరకు బలంగా ఉన్న కాంగ్రెస్, టీడీపీలకు షాక్ ఇచ్చారు. దీంతో కవిత కూడా రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో జాగృతి తరఫున అభ్యర్థులను నిలపాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. సింహం గుర్తుపై తమ అభ్యర్థులను పోటీకి నిలపబోతున్నారు. ఇది జిల్లా, మండల పరిషత్ ఎన్నికలకు కూడా వర్తిస్తుంది. స్వతంత్ర పార్టీ గుర్తు పొందడానికి సమయం లేకపోవడంతో, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సింహం గుర్తును ఉపయోగించాలని అగ్రనాయకత్వం చర్చలు జరిపి నిర్ణయించింది. ఈ వ్యూహం పార్టీకి క్షేత్రస్థాయిలో గుర్తింపు తెస్తుంది. సింహం చిహ్నం ధైర్యం, ఆధిపత్యాన్ని సూచిస్తుంది. పార్టీకి సరిపోతుంది. మున్సిపల్ ఎన్నికల్లో కొత్త రాష్ట్ర పార్టీలకు ఇలాంటి గుర్తులు పోటీ సాధ్యం చేస్తాయి. ఏఐఎఫ్‌బీతో ఈమేరకు చర్చలు జరిగినట్లు తెలిసింది. ఇది జాగృతికి స్వతంత్ర గుర్తు లేకుండా కూడా ఓటర్ల మద్దతు సేకరించే అవకాశం. ఫలితంగా, స్థానిక సమస్యలపై దృష్టి పెట్టి పార్టీ ప్రభావాన్ని విస్తరించవచ్చు. మున్సిపల్ ఎన్నికల్లో కవిత పోటీతో రాజకీయాలు మారనున్నాయి. కవిత ప్రతిపక్ష లీడర్‌గా అధికార కాంగ్రెస్‌కన్నా.. బీఆర్ఎస్‌నే ఎక్కువగా విమర్శిస్తున్నారు. పదేళ్లలో ఆ పార్టీ చేసిన తప్పులను బయటపెడుతున్నారు. ఫోన్ ట్యాపింగ్ కూడా జరిగినట్లు అంగీకరించారు. ఇక ప్రాజెక్టుల్లో భారీగా అవినీతి జరిగిందన్నారు. పదేళ్లలో అవినీతి వేళ్లూనుకుపోయిందని విమర్శించారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికల్లో కవిత ప్రభావం కాంగ్రెస్ పార్టీకన్నా.. బీఆర్ఎస్‌పైనే ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఎందుకంటే.. మాజీ బీఆర్ఎస్ నేత కావడం, బీఆర్ఎస్‌లో ఇప్పటికీ కవిత సానుభూతిపరులు ఉన్నారు. తండ్రి కేసీఆర్ కూడా కవితపై ప్రేమ ఉంది. త్వరలో జరుగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కవిత ప్రభావం ఏమేరకు ఉంటుంది.. ఏ పార్టీ ఓట్లు చీలుస్తారు అనేది రాబోయే రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# ఇక తెలంగాణలో ఎస్ ఐ ఆర్

హైదరాబాద్,భారత శక్తి ప్రతినిధి, జనవరి 26:

తెలంగాణలో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ త్వరలో నిర్వహించే అవకాశం ఉంది ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ మాట్లాడుతూ.. మిగిలిన రాష్ట్రాలలో SmF త్వరలో అమలు చేస్తాం, నిజమైన ఓటర్ల జాబితాలు ప్రజాస్వామ్యానికి పునాది అని ఆయన అభివర్ణించారు. అయితే తెలంగాణలో ఈ ూఎఖీ అమలు చేస్తే ప్రజల నుంచి కొన్ని పత్రాలు కోరే అవకాశం ఉంది. మరి అవేంటో తెలుసుకుంటే రెడీగా ఉండొచ్చు. గణన దశలో ఓటర్లు ఎటువంటి పత్రాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. అయితే నోటీసు దశలో అవి మ్యాప్ చేయకపోతే, లేదా ఓటర్ నిర్ధారణలో ఏమైనా సమస్యలు ఉంటే వారు పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. గణన ఫారమ్‌లో ఓటర్లు మునుపటి ూఎఖీ నుండి తమ లేదా వారి బంధువుల వివరాలను ఇవ్వవచ్చు. ఈ రెండు వివరాలను ఇవ్వడం వలన లింక్ చేయడం లేదా మ్యాపింగ్ చేయడంలో సహాయపడుతుంది. అటువంటి ఓటర్లు గణన ఫారమ్‌లు తప్ప మరే పత్రాలను సమర్పించాల్సిన అవసరం లేదు.

మ్యాపింగ్ కొరకు బంధువులు:

తండ్రి

తల్లి

తల్లి తరపు తాత

అమ్మమ్మ

తండ్రి తరపు తాత

తండ్రి తరపు నాన్నమ్మ

జాబితాలో పేరు లేదా బంధువుల పేరు (సంతాన భావన) లేని వారు తెలంగాణ, ఇతర రాష్ట్రాలలో ూఎఖీ తరువాతి దశలో పత్రాలను సమర్పించమని అడుగుతారు. వ్యక్తి ఈ క్రింది 11 పత్రాలలో ఒకదాన్ని సమర్పించాలి

ఏదైనా కేంద్ర ప్రభుత్వం/రాష్ట్ర ప్రభుత్వం/ఖూజ సాధారణ ఉద్యోగి/పెన్షనర్‌కు జారీ చేయబడిన ఏదైనా గుర్తింపు కార్డు/పెన్షన్ చెల్లింపు ఉత్తర్వు.

1987 జూలై 1కి ముందు భారతదేశంలో ప్రభుత్వం/స్థానిక అధికారులు/బ్యాంకులు/పోస్ట్ ఆఫీస్/ఓఎఅ/ఖూజలు జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు/సర్టిఫికేట్/పత్రం.

సమర్థ అధికారం జారీ చేసిన జనన ధృవీకరణ పత్రం.

పాస్‌పోర్ట్

గుర్తింపు పొందిన బోర్డులు/విశ్వవిద్యాలయాలు జారీ చేసిన మెట్రిక్యులేషన్/విద్యా ధృవీకరణ పత్రం

సమర్థ రాష్ట్ర అధికారం జారీ చేసిన శాశ్వత నివాస ధృవీకరణ పత్రం

అటవీ హక్కుల ధృవీకరణ పత్రం

ూః అ/ూఅ/ూ లేదా కాంపిటెంట్ అథారిటీ జారీ చేసిన ఏదైనా కుల ధృవీకరణ పత్రం

జాతీయ పౌరుల రిజిస్టర్ (అది ఎక్కడ ఉన్నా)

రాష్ట్ర/స్థానిక అధికారులు తయారుచేసిన కుటుంబ రిజిస్టర్.

ప్రభుత్వం నుండి ఏదైనా భూమి/ఇల్లు కేటాయింపు ధృవీకరణ పత్రం


ఆధార్ కోసం, 09.09.2025 తేదీ 23/2025-ఇఖీూ/ ఎనీశ్రీ.ఎఎ లేఖ ద్వారా జారీ చేయబడిన కమిషన్ ఆదేశాలు వర్తిస్తాయి.

అయితే ూఎఖీకి అవసరమైన పత్రాలు హైదరాబాద్, ఇతర తెలంగాణ జిల్లాల్లోని అందరు ఓటర్లకు పుట్టిన తేదీ ఆధారంగా ఉంటాయి. జూలై 1, 1987 కి ముందు జన్మించిన వారు తమ కోసం జాబితా చేయబడిన ఏవైనా పత్రాలను సమర్పించాలి. మరోవైపు జూలై 1, 1987న లేదా ఆ తర్వాత, డిసెంబర్ 2, 2004న లేదా అంతకు ముందు జన్మించిన వారు తమ కోసం ఒక పత్రాన్ని, తండ్రి లేదా తల్లి పత్రాన్ని అందించాలి. 2004 డిసెంబర్ 2 తర్వాత జన్మించిన వారు తమ తల్లిదండ్రులిద్దరికీ సంబంధించిన పత్రాన్ని సమర్పించాలి.

# కదులుతున్న సింగరేణి డొంక

హైదరాబాద్,భారత శక్తి ప్రతినిధి, జనవరి 26:

తెలంగాణ రాజకీయాల్లో సింగరేణి బొగ్గు గనుల కేటాయింపు వ్యవహారం ఇప్పుడు ఒక పెద్ద కుదుపుకు కారణమైంది. తెలంగాణ రాజకీయాల్లో సింగరేణి కాలరీస్ చుట్టూ



ముసురుకున్న అవినీతి ఆరోపణలు పెను దుమారం రేపుతున్నాయి. సింగరేణిలో జరుగుతున్న టెండర్ల ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని, ఈ మొత్తం వ్యవహారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూత్రధారి అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. ఈ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో లేదా సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కుంభకోణంలో ప్రధానంగా 'సైట్ విజిట్ సర్టిఫికెట్' అనే కొత్త నిబంధనను హరీశ్ రావు ఎండగట్టారు. గతంలో లేని విధంగా, కేవలం తమకు కావలసిన కాంట్రాక్టర్లకు పనులు కట్టబెట్టేందుకే ఈ నిబంధనను తెరపైకి తెచ్చారని ఆయన ఆరోపించారు. జనవరి 2025లో భూపాలపల్లి పనుల కోసం జారీ చేసిన టెండర్లలో ఎలాంటి సైట్ విజిట్ నిబంధన లేదని, అప్పుడు అంచనా వ్యయం కంటే 7 శాతం తక్కువకే టెండర్లు ఖరారయ్యాయని ఆయన గుర్తు చేశారు. మూడు నెలల వ్యవధిలోనే, అంటే మే 2025లో నిబంధనలను మార్చి కొత్త టెండర్లు జారీ చేయడంలోని అంతరార్థం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ మార్పుల వల్ల పోటీ తగ్గి, సీఎం రేవంత్ రెడ్డి బావమరిది సృజన్ రెడ్డికి చెందిన 'శోధా కన్‌స్ట్రక్షన్స్' లబ్ధి పొందిందని హరీశ్ రావు స్పష్టం చేశారు. నైనీ బ్లాక్ టెండర్లను ప్రభుత్వం రద్దు చేయడమే అక్కడ అక్రమాలు జరిగాయనడానికి నిలువెత్తు నిదర్శనమని హరీశ్ రావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితులైన వారికే కాంట్రాక్టులు దక్కేలా నిబంధనలను తుంగలో తొక్కారని విమర్శించారు. ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన మూడు ప్రధాన అంశాలను ఆయన లేవనెత్తారు. ఈ కుంభకోణానికి బాధ్యులు ఎవరు?, దీని వల్ల సింగరేణికి, ప్రభుత్వానికి జరిగిన నష్టం ఎంత?, ఈ వ్యవహారంలో వ్యక్తిగతంగా లబ్ధి పొందిన వారెవరు? లాంటి అంశాలు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ఒడిశాలోని నైని కోల్ బ్లాక్ నిర్వహణ బాధ్యతలను ఒక ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందన్న ఆరోపణలు, చివరకు విచారణ డిమాండ్ల దాకా వెళ్లాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య ఈ అంశంపై మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. ఒడిశాలో సింగరేణికి కేటాయించిన నైని బొగ్గు గని తవ్వకాల కోసం పిలిచిన టెండర్లలో నిబంధనలను ఒకరికి అనుకూలంగా మార్చారనేది ప్రధాన ఆరోపణ. ముఖ్యంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఒక ప్రముఖ మీడియా సంస్థ అధిపతి అల్లుడికి చెందిన సంస్థకు ఈ కాంట్రాక్ట్ దక్కేలా చేస్తున్నారని బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. 'సైట్ విజిట్' నిబంధనను సాకుగా చూపి అర్హత ఉన్న సంస్థలను తప్పించారని విపక్షాలు ఆరోపించాయి ఈ ఆరోపణలు వెల్లువెత్తిన వెంటనే అప్రమత్తమైన భట్టి విక్రమార్క, ప్రభుత్వంపై ఎటువంటి మచ్చ పడకూడదనే ఉద్దేశంతో ఆ టెండర్లను రద్దు చేస్తున్నట్లు సంచలన ప్రకటన చేశారు. తాజాగా మీడియా ముందుకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బీఆర్ఎస్ విమర్శలపై ధీటుగా స్పందించారు. కేవలం తాజా టెండర్లే కాకుండా, 2014 నుంచి సింగరేణిలో జరిగిన బొగ్గు గనుల కేటాయింపులన్నింటిపై విచారణ జరిపించేందుకు తాము సిద్ధమని ప్రకటించారు. "దీనిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి హరీశ్ రావు లేఖ రాయాల్సిన అవసరం లేదు. మాకు లేఖ రాస్తే చాలు, గత పదేళ్లలో జరిగిన ప్రతి వ్యవహారంపై సమగ్ర విచారణ చేయిస్తాం" అని భట్టి సవాల్ విసిరారు. ఈ వివాదంలో ప్రధానంగా వినిపిస్తున్న పేరు సృజన్ రెడ్డి. ఆయనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంబంధం ఉందని బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలను భట్టి తీవ్రంగా ఖండించారు. సృజన్ రెడ్డికి, రేవంత్ రెడ్డికి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేస్తూ, అసలు వాస్తవాలను బయటపెట్టారు. సృజన్ రెడ్డి, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అల్లుడని భట్టి వెల్లడించారు. ఆయన ఇప్పటికీ బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నారని, సొంత పార్టీ నేత అల్లుడిపైనే బీఆర్ఎస్ బురద జల్లడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. టెండర్లలో అక్రమాలకు తావిచ్చేలా ఉన్న 'సైట్ విజిట్' నిబంధనపై భట్టి క్లారిటీ ఇచ్చారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తెచ్చింది కాదని భట్టి పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాం నుంచే ఈ నిబంధన అమల్లో ఉందని, గతంలో జరిగిన కేటాయింపుల్లోనూ ఇదే పద్ధతి అనుసరించారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కావాలనే అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. సింగరేణి బొగ్గు గనుల వ్యవహారం ఇప్పుడు కేవలం ఒక టెండర్ రద్దుతో ముగిసిపోయేలా కనిపించడం లేదు. 2014 నుంచి జరిగిన కేటాయింపులపై విచారణకు ప్రభుత్వం సిద్ధమనడం ద్వారా బంతిని ఇప్పుడు బీఆర్ఎస్ కోర్టులోకి నెట్టింది. ఒకవేళ విచారణ జరిగితే, గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఒప్పందాలలోని లోపాలు కూడా బయటపడే అవకాశం ఉంది. మొత్తానికి, సింగరేణి బొగ్గు గనుల సెగ తెలంగాణ రాజకీయాలను మరింత వేడెక్కించబోతోంది. కేవలం టెండర్ల అక్రమాలే కాకుండా, సింగరేణి కార్మికులకు చెల్లించాల్సిన బోనస్ విషయంలో కూడా ప్రభుత్వం మోసానికి పాల్పడిందని హరీశ్ రావు ధ్వజమెత్తారు. సింగరేణికి సుమారు రూ. 6,900 కోట్ల లాభాలు వచ్చినప్పటికీ, ఆ లెక్కలను ప్రభుత్వం దాచిపెట్టిందని ఆరోపించారు. లాభాలను తక్కువ చేసి చూపడం ద్వారా కార్మికులకు దక్కాల్సిన బోనస్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం తగ్గించిందని ఆయన విమర్శించారు. సింగరేణిలో 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం, ఇంత పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వస్తున్నా ఎందుకు మౌనంగా ఉందని ఆయన ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీలు ఒకరికొకరు సహకరించుకుంటూ సింగరేణిని ప్రైవేటీకరించే దిశగా అడుగులు వేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అవినీతిపై కేంద్ర దర్యాప్తు సంస్థలు వెంటనే స్పందించాలని, అప్పుడే నిజానిజాలు బయటకు వస్తాయని డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసలు విషయాలను పక్కన పెట్టి, సంబంధం లేని పత్రాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని హరీశ్ రావు విమర్శించారు. 'సైట్ విజిట్ సర్టిఫికెట్' పేరుతో జారీ చేసిన అన్ని టెండర్లను రద్దు చేయాలని, తక్షణమే ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని ఆయన పట్టుబట్టారు. ఈ ఆరోపణలతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

===========================

# మారుతోన్న నగరి లెక్కలు

తిరుపతి,భారత శక్తి ప్రతినిధి, జనవరి 26:

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగరి నియోజకవర్గం లో రాజకీయ వాతావరణం వేగంగా మారుతోంది. గత ఎన్నికల సమయంలో కనిపించిన సమీకరణలకు భిన్నంగా ఇప్పుడు పరిస్థితులు రూపుదిద్దుకుంటున్నాయి. ఈ మార్పులు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకురాలు రోజా రాజకీయ భవితవ్యంపై చర్చను మళ్లీ తెరపైకి తీసుకొస్తున్నాయి. ఒకప్పుడు నగరి పరిసర మండలాల్లో రోజా పేరు బలంగా వినిపించేది. కానీ గత ఎన్నికలకు ముందే ఆమె ఉనికి తగ్గినట్టు కనిపించగా, ఇప్పుడు మరింత మౌనం నెలకొన్నట్టు రాజకీయ వర్గాలు మాట్లాడుకుంటున్నాయి. నగరి నియోజకవర్గంలో నింద్ర , విజయపురం , నగరి , పుత్తూరు, వడమాలపేట వంటి మండలాలు ఉన్నాయి. వీటిలో గత ఎన్నికలకు ముందు వరకు నింద్ర, వడమాలపేటల్లో రోజాకు గట్టి మద్దతు ఉందనే భావన ఉండేది. మంత్రిగా ఉన్న రోజుల్లో కూడా ఆమె ఈ రెండు మండలాలపైనే ఎక్కువ దృష్టి పెట్టారని స్థానికులు గుర్తు చేస్తారు. తరచూ పర్యటనలు, కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఇవే తన బలం ఉన్న ప్రాంతాలుగా రోజా చెప్పుకొనేవారు. నగరి మండలంలో పరిస్థితి మాత్రం సమంగా ఉండేది. అభిమానులు ఉన్నప్పటికీ వ్యతిరేకత కూడా అంతే స్థాయిలో ఉండేది. విజయపురం, పుత్తూరులో అయితే పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారింది. అక్కడ వైసీపీ వర్గాలు రెండు గ్రూపులుగా విడిపోయాయి. ఈ పరిణామాలు గత ఎన్నికలకు ముందే మొదలయ్యాయి. అదే సమయంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రభావం ఈ ప్రాంతాల్లో ఎక్కువగా ఉండటం కూడా రోజాకు సవాలుగా మారింది. ఈ కారణాల వల్ల ఆమె నింద్ర, వడమాలపేటలపైనే ఎక్కువగా ఆధారపడినట్టు కనిపించింది. అయితే తాజా రాజకీయ పరిణామాలు ఈ రెండు మండలాల్లో కూడా మార్పు వస్తున్నాయనే సంకేతాలు ఇస్తున్నాయి. ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ నియోజకవర్గం అంతటా చురుకుగా పర్యటిస్తున్నారు. తమకు బలం ఉన్న ప్రాంతాలతో పాటు బలహీనంగా ఉన్న మండలాలపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టడం ఆయన వ్యూహంగా కనిపిస్తోంది. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థాయిలో అమలు చేయడం, సమస్యలపై వెంటనే స్పందించడం వల్ల ప్రజల్లో ఆయన పట్ల అనుకూలత పెరుగుతోందని అంటున్నారు. ఇదే సమయంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు కూడా ఊపందుకున్నాయి. ఈ పరిణామాల ప్రభావంతో గతంలో రోజాకు అంతో ఇంతో మద్దతు కనిపించిన నింద్ర, వడమాలపేటల్లో ఇప్పుడు ఆమె పర్యటనలకు పెద్దగా స్పందన లేకపోతున్నట్టు చర్చ సాగుతోంది. ఒకప్పుడు కనిపించిన స్వాగతాలు, హడావిడి ఇప్పుడు తగ్గినట్టు స్థానిక రాజకీయ వర్గాలు చెబుతున్నాయిఈ మారుతున్న రాజకీయ సమీకరణలు వచ్చే ఎన్నికల నాటికి ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది. నగరి నియోజకవర్గంలో చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు రోజా రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయా? లేక ఆమె మళ్లీ తన పాత బలాన్ని సమీకరించగలుగుతుందా? అన్న ప్రశ్నలకు సమాధానం కాలమే చెప్పాల్సి ఉంది. కానీ ప్రస్తుతానికి మాత్రం నగరిలో రాజకీయ గాలి మారుతోందన్న మాట వినిపిస్తోంది.

# ఇక తగ్గనున్న రిజిస్ట్రేషన్ కష్టాలు




హైదరాబాద్,భారత శక్తి ప్రతినిధి, జనవరి 26:

తెలంగాణ ప్రభుత్వం వాహన రిజిస్ట్రేషన్ విధానంలో కొత్త పద్ధతి అమలులోకి తెచ్చింది. ఇటు వాహనదారులకు, అటు రవాణా అధికారులకు ఇద్దరికీ మేలు జరిగేలా నూతన విధానం నుంచి అమలులోకి వచ్చింది. వాహనం కొన్న చోటే రిజిస్ట్రేషన్ చేసే విధానం ప్రవేశపెట్టింది. మాదాపూర్ రవాణా కార్యాలయంలో నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతమైంది. దీంతో రాష్ట్రమంతా అమలులోకి తెచ్చింది. కొత్త వాహనాలు కొనుగోలు చేస్తే ఇకపై ఆర్డీవో కార్యాలయాల్లో క్యూలు, చక్కరలు అవసరం లేదు. డీలర్లు ఫొటోలు, డాక్యుమెంట్లు ఆన్‌లైన్‌లో సమర్పించి నంబర్ కేటాయిస్తారు. డీలర్లు ఇన్‌వాయిస్, బీమా, చిరునామా ధ్రువీకరణ, వాహన చిత్రాలు అప్‌లోడ్ చేస్తారు. అధికారులు డిజిటల్ పరిశీలన తర్వాత ఆమోదం ఇస్తారు. ఆర్సీ కార్డు చిరునామాకు పోస్ట్ అవుతుంది. అవసరమైతే షోరూమ్‌లో తనిఖీ జరుగుతుంది. అయితే కొత్త విధానం ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు మాత్రమే. వాణిజ్య వాహనాలు ఆర్డీవోలోనే చేసుకోవాలి. ఆర్టీవోలో స్లాట్ బుకింగ్, వేచి ఉండటం ముగిసిపోతుంది. కొనుగోలు రోజు సాయంత్రానికి రిజిస్ట్రేషన్ పూర్తి. పట్టణ ప్రజలకు మార్గదర్శకం. డిజిటల్ పారదర్శకత పెరుగుతుంది, అక్రమాలు, బ్రోకర్ వ్యవస్థ తగ్గుతుంది. ఈ వ్యవస్థ వాహన డీలర్లను బలోపేతం చేస్తుంది. వినియోగదారుల అనుభవం మెరుగవుతుంది. రాష్ట్రవ్యాప్త అమలుతో ట్రాఫిక్, కార్యాచరణ సమస్యలు తగ్గుతాయి. తెలంగాణ సంయుక్త రవాణా కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ వాహనాల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన నూతన విధానాన్ని ప్రారంభించారు. ఈ విధానం వల్ల వినియోగదారులకు సమయం ఆదా అవుతుంది. రిజిస్ట్రేషన్ కోసం రవాణా కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. వాహనం అమ్మిన డీలర్ శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం ఆన్లైన్ లో దరఖాస్తు చేస్తారు. రవాణా శాఖ అధికారులు ఆన్లైన్లో పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటారు. ఉదయం వాహనం కొనుగోలు చేస్తే.. సాయంత్రానికి శాశ్వత రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. ఒకవేళ ఆ వాహనాన్ని సాయంత్రం కొనుగోలు చేస్తే.. రిజిస్ట్రేషన్ మాత్రం మరుసటి రోజు పూర్తవుతుంది. ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ కోసం ఇన్ వాయిస్, ఫారం 21, ఫారం 22, ఇన్సూరెన్స్, అడ్రస్ ప్రూఫ్, వెహికల్ ఫోటోలను డీలర్ ఆన్లైన్లో అప్లోడ్ చేస్తాడు. రవాణా శాఖ అధికారి ఆ దరఖాస్తు మొత్తాన్ని పరిశీలించి.. రిజిస్ట్రేషన్ నెంబర్ కేటాయిస్తారు. ఈ ప్రక్రియ మొత్తం పూర్తి అయిన తర్వాత రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ స్పీడ్ పోస్ట్ ద్వారా వాహనాన్ని కొనుగోలు చేసిన వ్యక్తికి వెళ్తుంది. శాశ్వత రిజిస్ట్రేషన్లకు సంబంధించి అవసరమైతే వాహనాలను తనిఖీ చేస్తామని.. డీలర్ల షోరూంలోకి వెళ్లి వాహనాలను పరిశీలిస్తామని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ విధానం కేవలం బైక్, కార్లకు మాత్రమే వర్తిస్తుంది. కమర్షియల్ వెహికల్స్ రిజిస్ట్రేషన్ యధావిధిగా ఆర్టీవో కార్యాలయాలలోనే జరుగుతూ ఉంటుంది.

## 8 శతాబ్దాల చరిత్ర

# సమ్మక్క, సారక్క జాతర

వరంగల్, భారత శక్తి ప్రతినిధి, జనవరి 26:




తెలంగాణ రాష్ట్రంలోని మారుమూల మేడారం ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జాతీయ మీడియాలో మార్మోగుతూ ఉంటుంది. అంతర్జాతీయ మీడియాలోనూ స్థానం సంపాదించుకుంటూ ఉంటుంది. ఇంతటి చరిత్ర.. ఇంతటి ఘన కీర్తి వెనక చాలా చరిత్ర ఉంది. ఈ చరిత్ర తెలుసుకోవాలంటే ఒక ఎనిమిది శతాబ్దాలు వెనక్కి వెళ్లాలి. సమ్మక్క జాతర 8 శతాబ్దాల క్రితం నుంచే మొదలైంది. ఆదివాసులకు ఆరాధ్య దైవంగా సమ్మక్క సారలమ్మ నిలవడం అప్పుడే ప్రారంభమైంది. సమ్మక్క, సారలమ్మ, పగడిద్దరాజు, నాగులమ్మ, జంపన్నకు ఎటువంటి రూపాలు ఉండవు. కేవలం గద్దెల రూపంలోనే వీరికి పూజలు జరుగుతూ ఉంటాయి.. ఒకప్పుడు ఆదివాసీ దేవతల గద్దెలు ఇనుప గ్రిల్స్ మధ్య, వెదురు బొంగుల రూపంలో ఉండేవి. అయితే ఇప్పుడు ప్రభుత్వం ఆ వనదేవతల గద్దెలను పునర్ నిర్మించింది. అప్పట్లో సమ్మక్క సారలమ్మ కు మాత్రమే ఈ గద్దెలు ఉండేవి. అనంతరం భక్తుల రాక పెరుగుతున్న నేపథ్యంలో ఆలయానికి సరికొత్త రూపం తీసుకొచ్చారు. సమ్మక్క, సారలమ్మకు దక్షిణం వైపు చిన్న గద్దెల రూపంలో పగిడిద్దరాజు, గోవిందరాజులు ఉండేవారు. అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఈ గద్దెలు ఉన్న ప్రాంతాన్ని విస్తరించింది. గతంలో గద్దెలు ఉన్న విస్తీర్ణంలో కేవలం 2500 మంది భక్తులు మాత్రమే ఉండడానికి అవకాశం ఉండేది. ఇప్పుడు గద్దెలను విస్తరించిన తర్వాత 9,000 మంది దాకా భక్తులు ఉండడానికి అవకాశం ఏర్పడింది. దీనికి తోడు సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలను ఒకే వరుసలోకి తీసుకొచ్చాడు. ముందుగా భక్తులు నాగులమ్మ గద్దె వద్ద పూజలు చేస్తారు. ఆ తర్వాత వరుసగా సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటారు. భక్తుల మొక్కులు చెల్లించుకుని సాఫీగా బయటికి వెళ్లే విధంగా ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. వరదేవతల చుట్టూ గ్రానైట్ రాతితో నిర్మాణాలను రూపొందించింది. అంతేకాకుండా, సమ్మక్క వంశ చరిత్ర తెలిసే విధంగా గ్రానైట్ రాతి మీద తోరణాలు ఏర్పాటు చేసింది. నాలుగు గద్దెల చుట్టూ 32 గ్రానైట్ స్తంభాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. వాటి మీద ఆదివాసి సంస్కృతి, ఆచారాలు తెలిపే విధంగా చిహ్నాలు రూపొందించింది. ఈ స్తంభాల మీద సుమారు 750 మంది కోయ వంశీయుల పేర్లకు సంబంధించిన ఏడు వేలకు పైగా శిల్పాలను రూపొందించారు. సమ్మక్కతోపాటుగా మిగతా ఆదివాసీల గోత్రాలను.. వారి వ్యవహారాలను చిత్రాలుగా రూపొందించారు. రాతి స్తంభాల మధ్య గతంలో వెదురు బొంగుల రూపంలో ఉన్న అమ్మవార్ల ప్రధాన రూపాలను యధావిధి గానే ఉంచారు.. సూర్యచంద్రులు, నెలవంక, త్రిశూలం, బండి చక్రాలు, కంకవనం, నిలువు గీతలు వంటి వాటిని రాతి స్తంభాల మీద చెక్కారు

గొట్టు గోత్రాలు ఎలా ఉన్నాయి అంటే

సారలమ్మ వంశానిది మూడవ గొట్టు. ఈమె వంశవృక్షం ఇప్ప. పూజిత వృక్షం కస్సు.

పగిడిద్దరాజు, గోవిందరాజు నాలుగవ గొట్టు గోత్రానికి చెందినవారు. వీరి దేవతావృక్షం మద్ది. పూజిత వృక్షం బూరుగ.

సమ్మక్క వంశానిది ఐదవ గొట్టు గోత్రం. వీరి దేవతావృక్షం వెదురు. పూజిత వృక్షం మారేడు.

బేరంబోయిన రాజు వంశం గోత్రం ఆరవగొట్టు. వీరి దేవతావృక్షం బండారి. పూజిత వృక్షం వేపచెట్టు.

సిద్దబోయిన వంశం వారి గోత్రం ఎనిమిదవ గొట్టు. వీరి దేవతావృక్షం నెమలి నారా. పూజిత వృక్షం మర్రి.

# దొడ్డుబియ్యం అమ్మకం సవాలే

నల్గొండ, హైదరాబాద్,భారత శక్తి ప్రతినిధి, జనవరి 26:



తెలంగాణ ప్రభుత్వానికి దొడ్డు బియ్యాన్ని వేలం వేయడం సవాల్‌గా మారింది. గోదాములు, రేషన్ షాపుల వద్ద నిల్వ ఉన్న దొడ్డు బియ్యం విక్రయానికి సివిల్ సప్లయ్ శాఖ టెం డర్ పిలిచినా.. ఒక్క కంపెనీ కూడా ముందుకు రావడం లేదు. వేలం వేయడం ఆలస్యమైన కొద్దీ నష్టం కూడా పెరుగుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో దొడ్డు బియ్యం విక్రయానికి మరోసారి టెండర్‌ను ఆహ్వానించి.. త్వరగా విక్రయించాలని సంబంధిత శాఖ అధికారులు ఆలోచన చేస్తున్నారు. తెలంగాణ పర్యాటకంరెండోసారి ఆహ్వానించే టెండర్‌లో.. కిలో బియ్యం ధరను కొంత తగ్గించాలనే ఆలోచనలో ఉన్నట్లుగా సమాచారం. సర్కార్ నుంచి అనుమతి రాగా నే.. టెండర్ ఆహ్వానించాలనే యోచనలో ఉన్నట్లుగా అధికారులు చెబుతున్నారు. గతేడాది ఏప్రిల్‌లో ఉగాది నుంచి రాష్ట ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా తెల్ల రేషన్ కార్డులున్న వినియోగదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. అప్పటివరకు రాష్ట్రంలో 1.40 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం మిగిలింది. ఈ బియ్యం విలువ సుమారుగా రూ. 500 కోట్ల వరకు ఉంటుందని సివిల్ సప్లయ్ శాఖ అంచనా వేసింది. మిగిలిపోయిన ఈ దొడ్డు బియ్యం టెండర్ ద్వారా విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే గత నెలలోనే పేరుకుపోయిన దొడ్డు బియ్యానికి సివిల్ సప్లయ్ శాఖ టెండర్‌ను ఆహ్వానించినా.. ఒక్క టెండర్ కూడా రాలేదు. దీంతో దొడ్డుబియ్యం కొనుగోలు కోసం టెండర్లు వస్తే గత మంగళవారమే తెరవాలి. కానీ ఒక్క టెండర్ కూడా రాకపోవడంతో.. మరోసారి టెండర్లను ఆహ్వానానికి కసరత్తు చేస్తున్నారు. అయితే దొడ్డు బియ్యం కొనుగోలుకు మొదటిసారి బిడ్డర్లు ముందుకు రాకపోవడానికి ప్రధాన కారణం మొత్తం నిల్వగా ఉన్న 1.40 లక్షల టన్నులను ఒకే లాట్ కింద పెట్టడమే ఇబ్బందికరంగా మారిందనే విమర్శలు ఉన్నాయి. ఈ టెండర్‌క్ పెద్ద బిడ్డర్లు రాకపోవడం, చిన్నబిడ్డర్లు పాల్గొనే అవకాశం లేక పోవడం ప్రధాన కారణమని చెబుతున్నారు. కనీసం చిన్న లాట్లుగా ఏర్పాటుచేసి టెండర్ ఆహ్వానిస్తే ఎక్కువ సంఖ్యలో బిడ్డర్లు పాల్గొనే అవకాశం ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా వేలం వేయా లనుకున్న బియ్యం ధరను కిలో రూ.24గా సివిల్ సప్లయ్ శాఖ ముందే నిర్ణయించడం కూడా బిడ్డర్లు ముందుకు రాకపోవడానికి ప్రధాణకారణమని చర్చ ఉంది. వేలం వేయాలనుకుంటున్న దొడ్డురకం బియ్యం అప్పటికే పాతపడటం, సగానికిపైగా పురుగులు పట్టి నాణ్యత లోపించి ఉండటంతో ఆ ధర మరీ ఎక్కువ అని బిడ్డర్లు అభిప్రాయపడినట్టు తెలిసింది. ఇది సివిల్ సప్లయ్ శాఖ అధికారుల నిర్లక్ష్యం, ముందుచూపులేని వి ధానంతోనే సర్కార్‌కు ఆర్థికంగా తీవ్రనష్టం చేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండోసారి ఆహ్వానించే టెండర్లలో మార్పు లు చేయనున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే ఏప్రిల్ నుంచి రేషన్ కార్డు దారులకు ప్రభుత్వం సన్న బియ్యం పంపిణి చేస్తుందని తెలిసినా.. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి దొడ్డుబియ్యాన్ని సరఫరా చేశారు. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన తేదీ మేరకు ఏప్రిల్ నెలలోనే ఉగాది పండుగ రోజునే సన్న బియ్యం పంపిణీ ప్రారంభించడంతో.. గోదాముల్లో 1.4 లక్షల టన్నుల బియ్యం, రేషన్‌షాపు డీలర్ల వద్ద 40 వేల మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలుగా పేరుకుపోయినాయి. రేషన్‌షాపుల్లోని బియ్యం పందికొక్కులు బుక్కి, ముక్కిపోయి పాడైపోతు న్నాయని, వాటిని వెంటనే వెనక్కి తీసుకోవాలని డీలర్లు అధికారులు ఇప్పటికే అనేకసార్లు ఫిర్యాదులు చేశారు. అధికారుల ఉదాసీనత వల్లే 10 నెలలుగా రూ.500 కోట్ల విలువైన బియ్యం అటు రేషన్‌దుకాణాలు, ఇటు గోదాముల్లో మూలుగుతున్నట్లుగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దొడ్డుబియ్యాన్ని వేలం వేయాలని సెప్టెంబర్ 9న అప్పటి సివిల్ సప్లయ్ శాఖ కమిషనర్ చౌహాన్ ఉత్తర్వులు జారీచేసినా టెండర్ పట్టాలెక్కడానికి 4నెలలు పట్టడం గమనార్హం. అధికారులు ముందుగా స్టాక్ నిలిపేసినా, లేదంటే స్టాక్‌ను వెంటనే వేలంలో అమ్మినా సివిల్ సప్లయ్‌కు భారీనష్టం తప్పేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# దేశమా నీకు ఇదే వందనం

దేశమా నీకు ఇదే వందనం
గణతంత్ర మా నీకు ఘన స్వాగతం
ఈ దేశం నాది ఈ రాజ్యం నాది అని ప్రతి పౌరుడుకి ఉండాలి
ప్రతి పౌరుడు సైనికుల పోరాడాలి!!
మూడు రంగుల జెండా మురిసిపోవాలి
భారతీయులంతా కలసి రావాలి
గణతంత్ర దినోత్సవ సంబరాలలో
మన దేశ ఖ్యాతి దిగంతాలు దాటాలే!!
నాటి నేతల స్ఫూర్తిని పునికి పుచ్చుకోవాలి
అభివృద్ధి బాటలో అడుగులు వేయాలి
భారతావని గుండెల్లో వెలుగులు నింపాలి
విజ్ఞాన గనిగా నింగినంటాలి
నా భారతదేశం!!

రచన :-
దేవులపల్లి రమేష్
కలం: శ్రీ వర్ష
నంగునూర్,సిద్దిపేట
9963701294

# జాతీయ బాలికా దినోత్సవ శుభాకాంక్షలు- బద్వేల్ ఎ ఎం సి చైర్మన్ నారిశెట్టి సుప్రజ



పోరుమామిళ్ళ, భారతశక్తి ప్రతినిధి, జనవరి 26: సమాజం లో బాలికలు విద్యను పొందడం ద్వారా మరియు సమాజంలో సమాన భాగస్వామ్యం ద్వారా ప్రతి బాలిక హక్కులను పరిరక్షించాలనే మన సమిష్టి ప్రతిజ్ఞను ఈ రోజు పునరుద్ఘాటిస్తుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, ఎన్ డి ఎ ప్రభుత్వం వికసిత్ భారత్ నిర్మాణంలో బాలికలు మరియు మహిళల పాత్రను బలోపేతం చేసే కార్యక్రమాలను ముందుకు తీసుకువెళుతూనే ఉంది.

# రూ. 4 కోట్ల తో సంగారెడ్డి పట్టణంలో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ప్రాంగణం లో నూతన భవన నిర్మాణం

**- 3.80 కోట్లతో సదాశివపేట పట్టణం లోనూతన ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నిర్మాణం**

**- ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ని కలిసి ప్రతిపాదనలు అందించిన జగ్గారెడ్డి**

సంగారెడ్డి,భారతశక్తి ప్రతినిధి,జనవరి 26:



సంగారెడ్డి, సదాశివపేట పట్టణాల్లో నూతన ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ల నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరు కానున్నాయి. సదాశివపేట పట్టణం లో ఆర్ అండ్ బి గెస్ట్ బిల్డింగ్ శిథిలావస్థకు చేరుకుంది. ఆ బిల్డింగ్ స్థానం లో రూ. 3.80 కోట్లతో నాలుగు సూట్ రూం లతో కూడిన నూతన గెస్ట్ హౌస్ నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్దం చేశారు. సంగారెడ్డి పట్టణం జిల్లా కేంద్రం కావడం తో వివిఐపి, విఐపి ల తాకిడి ఎక్కువగా ఉంటోంది. ఇప్పుడున్న గెస్ట్ హౌజ్ సరిపోవడం లేదు. దీనికి అదనంగా అదే ప్రాంగణం లో నాలుగు సూట్ రూం లతో కూడిన మరో గెస్ట్ హౌస్ నిర్మాణానికి రూ.4 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు సిద్దం చేశారు. జగ్గారెడ్డి స్వయంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇంటికి వెళ్లి ప్రతిపాదనలు అందించారు. జగ్గారెడ్డి ప్రతిపాదనలు ఆమోదించి వీలైనంత త్వరగా నిధులు మంజూరు చేయాలని ఆర్ అండ్ బి ఉన్నతాధికారులను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు.

# పౌరులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో జనవరి 26 (భారత శక్తి): నిర్మల్ కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో 16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులందరూ

ఓటు హక్కు ... ఓటు




హక్కు అనేది ప్రజాస్వామ్యానికి సూచిక అని తెలిపారు. భారతదేశంలో ఓటు హక్కు అమలైన తీరును వివరించారు. విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, పిల్లలందరికీ చిన్ననాటి నుంచే ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలపాలన్నారు. సమావేశానికి హాజరైన వారితో కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేశారు.

కార్యక్రమాలలో పాలుపంచుకున్న విద్యార్థులకు, అధికారులకు, క్రమం తప్పకుండా పలు ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకుంటున్న ఓటర్లను, కలెక్టర్ సన్మానించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. వీరంతా సమాజానికి ఆదర్శమని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీని కలెక్టరేట్ ప్రాంగణంలో జెండాను ఊపి కలెక్టర్ ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డిఓ రత్నకళ్యాణి, డి పి ఆర్ ఓ విష్ణువర్ధన్ .ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

## పోలీసు గౌరవ వందనం స్వీకరించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 26 (భారత శక్తి): నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ముఖ్య అతిథులుగా హాజరై పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు.

ఈ సందర్భంగా పరేడ్ కమాండర్గా వ్యవహరించిన ఆర్ఐ రమేష్ ఆధ్వర్యంలోని పోలీసు బృందం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎస్పీకి గౌరవ వందనం సమర్పించింది. అనంతరం జిల్లా కలెక్టర్ జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆ తర్వాత పోలీసు అధికారులకు, సిబ్బందికి తమ తమ విధుల్లో ప్రతిభ కనబర్చినందుకు కలెక్టర్, ఎస్పీ, వారికి ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, జిల్లా ఉ




న్నతాధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోరుమామిల్ల లో సర్పంచి యనమల సుధాకర్ ఆధ్వర్యంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



పోరుమామిళ్ళ, భారత శక్తి ప్రతినిధి, జనవరి 26: పోరుమామిళ్ల పట్టణంలోని మేజర్ పంచాయతీ సర్పంచి యనమల సుధాకర్ ఆధ్వర్యంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు, గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సర్పంచి యనమల సుధాకర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పుర ప్రజలు సచివాలయం సిబ్బంది నాయకులు, కార్యకర్తలు, వార్డు మెంబర్లు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు జాతీయ పతాకానికి వందనం అర్పించారు. ఈ సందర్భంగా పోరుమామిళ్ల పట్టణ మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కులను బాధ్యతలను గౌరవిస్తూ దేశ ఐక్యత సమగ్రత కోసం మనమందరము ఒకటిగా ముందుకు సాగుదాం. దేశ అభివృద్ధికి ప్రతి పౌరుడు బాధ్యతతో పనిచేయాలని, ముఖ్యంగా పరిశుభ్రత, పారదర్శకత మరియు ప్రజా సేవల పట్ల కట్టుబాటుతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ సచివాలయ సిబ్బంది, పోరుమామిళ్ల పంచాయతీ వార్డు మెంబర్లు , నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

## - జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి,భారత శక్తి, జనవరి 26 :

భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్?లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి వివరాలను సంక్షిప్తంగా వివరించారు. వేడుకల్లో భాగంగా డీఆర్డీఓ, హౌసింగ్, వైద్య ఆరోగ్య శాఖ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, అగ్నిమాపక శాఖ, మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగులు,వయోవృద్ధుల సంక్షేమ శాఖ, పోలీస్, రవాణా శాఖల ఆధ్వర్యంలో శకట ప్రదర్శనలు నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధులను ఘనంగా సన్మానించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, టీజీఐఐసీ చైర్?పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి ప్రశంసా పత్రాలను అందజేశారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న ఆరు పాఠశాలలకు ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. ఉత్తమ శకటాలుగా ఎంపికైన డీడబ్ల్యూఓ, డీఆర్డీఓ, జిల్లా రవాణా శాఖ, పోలీస్ శాఖలకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. కులాంతర వివాహాలు చేసుకున్న 41 జంటలకు ఒక కోటి రెండు లక్షల 50వేల రూపాయల చెక్కును




అందజేశారు. తొమ్మిది మంది దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు పంపిణీ చేశారు. వీరిలో ఐదుగురికి ల్యాప్?టాప్?లు, ఒకరికి ట్యాబ్, ముగ్గురికి 5జీ మొబైల్ ఫోన్లు అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్, టి జి ఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి లువివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్?పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్లు మాధురి, పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతి, రెవిన్యూ డివిజనల్ అధికారులు రాజేందర్, దేవుజా, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ డ్రెస్సుల పంపిణీ.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 26 (భారత శక్తి): ఐడియా అదిరింది సిద్దూర్ గ్రామంలో సామాజిక సేవా కార్యక్రమం హృదయాలను తాకింది. ప్రవీణ్ తన పుట్టినరోజు శుభ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ డ్రెస్సులు పంపిణీ చేసి తన పుట్టినరోజును అర్థవంతంగా మార్చుకున్నారు. ఈ కార్యక్రమం గ్రామస్తుల ప్రశంసలు పొందింది.



ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ "సేవే లక్ష్యం, పిల్లల భవిష్యత్తే ధ్యేయం. చదువుకు తోడ్పాటు అందించాలనే సంకల్పంతో నా పుట్టినరోజు రోజున ఈ కార్యక్రమం చేయడం ఎంతో ఆనందంగా ఉంది" అని తెలిపారు.

గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ప్రవీణ్ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి మంచి పనులు ఎన్నో చేయాలని మనస్ఫూర్తిగా కోరారు. పుట్టినరోజులను సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిద్దూర్ గ్రామ సర్పంచ్ మాలేపు దుర్పతి బాయ్ -- సుధాకర్ పాల్గొని, విద్యార్థులకు స్కూల్ డ్రెస్సులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జర్నలిస్టులు సమాజానికి ఆదర్శంగా ఉండాలి -టీఎస్ జెఏ 4 వ వార్షికోత్సవ వేడుకల్లో వ్యవస్థాపక అధ్యక్షుడు- కందుకూరి యాదగిరి

సూర్యాపేట(భారతశక్తి జిల్లా ప్రతినిధి)జనవరి 26:

జర్నలిస్టులంతా సమాజానికి ఆదర్శవంతంగా ఉండాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందుకూర్ యాదగిరి సూచించారు. అసోసియేషన్ నాలుగో వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో గల బదిరుల పాఠశాలలో చెవిటి మూగ విద్యార్థులకు అల్పాహారం పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం జిల్లా కేంద్రంలో గల కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు అనంతరం ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ ముందుకు తీసుకు వెళ్లేందుకు ఇప్పటివరకు సహకరించిన మిత్రులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేపట్టి అసోసియేషన్ను ట్రేడ్ యూనియన్ స్థాయికి తీసుకు వెళ్లేందుకు అందరూ సహకరించాలని కోరారు. అల్పాహార పండ్ల పంపిణీ కార్యక్రమానికి సహకరించిన జర్నలిస్టులు వంశీకృష్ణ శర్మ కొండా రవి లకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ధూపాటి శ్యాంబాబు, ప్రధాన కార్యదర్శి



మహమ్మద్ గౌస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ దుర్గం బాలు, కోశాధికారి కొరివి సతీష్ యాదవ్, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు దుస్సా చంద్రశేఖర్, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు గుంటి శ్రీనివాస్, సూర్యాపేట జిల్లా కౌన్సిల్ సభ్యులు దేశ గాని వెంకట్ గౌడ్, సూర్యాపేట జిల్లా సహాయ కార్యదర్శి తిరుపతి శ్రీనివాస్, నియోజకవర్గ నాయకులు యాతాకుల మధుసూదన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల సేవలో రాధాస్టీల్స్ సంస్థ ముందుంటుంది





మేడారం/ములుగు జిల్లా ప్రతినిధి, జనవరి 26 (భారత శక్తి) : మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతల భక్తుల సేవలో రాధ స్టీల్ సంస్థముందుంటుంది.

ములుగుజిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క - సారలమ్మ మహా జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం రాధా టిఎంటి స్టీల్ సంస్థ గత మూడు జాతరల నుండి నిరంతరంగా సేవా కార్య క్రమాలు నిర్వహిస్తున్నట్లు కం పెనీ ఎండీ సుమన్ డైరెక్టర్ అక్షత్ సరాఫ్ తెలిపారు. మేడారంలో ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ పంపిణీ కేంద్రాలను వారు ప్రారంభించారు. మేడారం గ్రామ పంచా యతీ కార్యాలయ సమీపంలో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ పంపిణీ కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర స్త్రీ–శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ(సీతక్క) ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఆసియా ఖండం నలుమూలల నుండి లక్షలాది మంది భక్తులు హాజరయ్యే మేడారం సమ్మక్క- సారలమ్మ మహా జాతరలో భక్తుల దాహార్తిని తీర్చాలనే లక్ష్యంతో ఉచిత మినరల్ వాటర్ కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా జనవరి 24 నుండి ఫిబ్రవరి 1 వరకు భక్తులకు ఉచితంగా మినరల్ వాటర్ పంపిణీ చేస్తామని అన్నారు. అలాగే మేడారం ప్రాంతంతో పాటు జాతరకు వచ్చే ప్రధాన మార్గాలు, కీలక ప్రదేశాల్లో భక్తులకు అవగాహన కల్పించే బోర్డులను సైతం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక వ్యాపారం నిర్వహిస్తున్న సంస్థగా, సమాజ సేవలో భాగస్వామ్యం కావడం తమ బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలకు తాము ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా డిపిఓ కొండా వెంకయ్య పలువురు ప్రజాప్రతినిధులు, కంపెనీ ప్రతినిధులైన కంపెనీ జీఎం వీరేష్ కుమార్, ఏజీఎం నరేష్? గౌడ్ , వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్ చార్జి వెంకటేశ్, కంపెనీ డీలర్ గంగిశెట్టి శ్రీని వాస్, లయన్ నాగరాజు, లయన్ చుంచు రమేష్, లయన్ సానికొమ్ము రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లా కలెక్టరు క్యాంపు కార్యాలయంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు.

## జాతీయ జెండాను ఎగురవేసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 26 ( భారత శక్తి): కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండాను ఎగురవేశారు. విద్యార్థులు, అధికారులు, కుటుంబ సభ్యులతో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాల విద్యార్థులకు మిఠాయిలు, బహుమతులు పంచారు. .జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గణతంత్ర దినోత్సవ కార్యక్రమంలో భాగంగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతీయ గీతం ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా ప్రజలకు, అధికారులకు, సిబ్బందికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్ లు జిల్లా అధికారులు, కార్యాలయాల సిబ్బంది, పాఠశాలల విద్యార్థులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# రవీందర్ కు పోలీస్ సేవా పథకం

సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి,జనవరి 26:

జిల్లా పోలీస్ శాఖలో ఐటి విభాగంలో పనిచేస్తున్న ఏఎస్ఐ మునగాల రవీందర్ కు సేవా పథకం లభించింది ఈ మేరకు జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్లో సోమవారం జరిగిన గణతంత్ర వేడుకల్లో బహూకరించారు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ,జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ లు ఆయనకు మెడల్ ను అందించారు. జిల్లా పోలీస్ శాఖలో రవీందర్ ఒక్కరికి మాత్రమే ఈ మెడల్ లభించింది. దశాబ్దాలకు పైగా పోలీసు శాఖలో విశిష్ట సేవలను అందించిన సందర్భంగా రవీందర్ కు ఈ గుర్తింపు దక్కింది. ఈ సందర్భంగా ఆయన్ని జిల్లా ఎస్పీ తో పాటు పలువురు అధికారులు అభినందించారు. సహచరులు శుభాకాంక్షలు తెలిపారు. రవీందర్ మాట్లాడుతూ ఎంతో క్రమశిక్షణ కలిగిన పోలీస్ శాఖలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధులను నిర్వహిస్తున్నామని అన్నారు. అప్పగించిన బాధ్యతను నిబంధనల కు అనుగుణంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు.

# సైబరాబాద్ లో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

సైబరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జనవరి 26: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్?లో ఈరోజు., 26.01.2026, 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, ఐపీఎస్., జాతీయ జెండాను ఆవిష్కరించి, స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరైన పోలీస్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. 1947 ఆగస్టు 15న ఢిల్లీలోని ఎర్రకోటపై భారత జాతీయ జెండా ఎగరవేసిన చారిత్రక ఘట్టాన్ని గుర్తు చేశారు. అలాగే 1949 నవంబర్ 26న భారతదేశం రాజ్యాంగాన్ని ఆమోదించుకుని, సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా రూపుదిద్దుకుని, 1950 జనవరి 26 నుంచి రాజ్యాంగం అమలులోకి వచ్చిందని వివరించారు.

భారత రాజ్యాంగం వల్లే ప్రతి పౌరుడికి ప్రాథమిక హక్కులు లభిస్తున్నాయని సీపీ తెలిపారు. రాజ్యాంగబద్ధమైన పదవులన్నీ



ప్రజల చేత ఎన్నికైన ప్రతినిధుల ద్వారానే నిర్వహిస్తున్నారని, ఇదే ప్రజాస్వామ్యానికి పునాదని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది కూడా రాజ్యాంగ పరిమితుల్లోనే తమ విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలు, మహిళా సాధికారత, మహిళల ఓటు హక్కు వంటి హక్కులను రాజ్యాంగమే కల్పించిందన్నారు. ఆసియా, ఆఫ్రికా, యూరప్ సహా పలు దేశాల్లో రాజకీయ అస్థిరతలు, తిరుగుబాట్లు కనిపిస్తున్నప్పటికీ, భారతదేశం సురక్షితంగా నిలబడటానికి దృఢమైన రాజ్యాంగమే ప్రధాన కారణమని సీపీ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు, న్యాయవ్యవస్థలు రాజ్యాంగాన్ని కాపాడుతూ ప్రజల హక్కులను రక్షిస్తున్నాయన్నారు.

ఈ సందర్భంగా అతి ఉత్కృష్ట, ఉత్కృష్ట సేవా పథకాల్లో ప్రతిభ కనబర్చిన సైబరాబాద్ పోలీస్ సిబ్బందిని సీపీ అభినందించారు. అలాగే రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం "పోలీస్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ" అవార్డు పొందిన హెడ్ కానిస్టేబుల్ మర్రి వెంకట్ రెడ్డిని సీపీ అభినందించి సన్మానించారు. అలాగే నలుగురికి అతి ఉత్కృష్ట సేవా పతకాలకు ఎంపికయ్యారు. వీరిలో రిటైర్డ్ రోడ్ సేఫ్టీ వింగ్ డీసీపీ ఎల్ సీ నాయక్, ఎస్ఐ షేక్ అబ్దుల్లా (మైలార్దేవ్?పల్లి పీఎస్), ఏఎస్ఐ కె. రవీందర్ రెడ్డి (రాజేంద్రనగర్ ట్రాఫిక్ పీఎస్), ఏఎస్?ఐ పొల్లంగారి సత్యనారాయణ రెడ్డి (మైలార్దేవ్‌పల్లి పీఎస్)లకు ఈ పతకాలను ప్రదానం చేశారు.

అలాగే ఉత్కృష్ట పతకాలకు ఎంపికైన 11 మంది పోలీస్ సిబ్బందికి పతకాలు ప్రదానం చేశారు. వీరిలో గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ గోనె సురేష్, ట్రాఫిక్ కంట్రోల్ రూమ్ హెడ్ కానిస్టేబుల్ కె. నాగేశ్, ఫింగర్ ప్రింట్స్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్ కుమ్మరి సురేందర్, కానిస్టేబుళ్లు అవుసుల పురుషోత్తం, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ లింగాల కరుణాకర్, షాద్‌నగర్ పోలీస్ స్టేషన్; ఎం. యాదయ్య, ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్; సిద్ధాపురం చంద్రశేఖర్, ఆర్‌టీఏఎం సెల్; కె. కిషోర్ బాబు, సీటీసీ సైబరాబాద్; రాజమోని జనార్ధన్, ఈ--చలాన్ విభాగం; ఇ. కృష్ణయ్య, ఆర్‌టీఏఎం సెల్; గొల్ల ప్రవీణ్ కుమార్, ఆర్‌టీఏఎం సెల్ సీపీ చేతుల మీదుగా పతకాలు అందుకున్నారు.

ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి డీసీపీ సి. హెచ్. శ్రీనివాస్, ఐపీఎస్., కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, ఐపీఎస్., అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, ఐపీఎస్., క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి, డబ్ల్యూ & సీఎస్‌డబ్ల్యూ డీసీపీ సృజన కరణం, ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్, మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ సాయి మనోహర్, ఏడీసీపీలు, ఏసీపీలు, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి, చీఫ్ అడ్మిన్ ఆఫీసర్ గీత, వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు, ఇన్ స్పెక్టర్లు, మినిస్టీరియల్ స్టాఫ్, వివిధ సెక్షన్ ల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి, జనవరి 26:

సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా జీవించాలని, ఎక్కడా అన్యాయం జరగకుండా సమన్యాయం జరగాలని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయమని అన్నారు. తెలంగాణ సాధన కోసం అప్పటి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి ఉద్యమాన్ని నడిపారని గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన అనంతరం కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చే విధంగా గుణాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని తెలిపారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ ప్రజలను మోసం చేస్తూ నట్టేట ముంచుతున్న పరిస్థితి నెలకొందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజల పక్షాన నిలబడి సుపరిపాలన అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి ఎన్




జి వో రాష్ట్ర మాజీ అధ్యక్షులు మామిళ్ళ రాజేందర్, మాజీ సీడీసీ చైర్మన్‌లు బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు హక్కీమ్, డా. శ్రీహరి, మందుల వరలక్ష్మి, వేణుగోపాల స్వామి, పట్టణ అధ్యక్షులు ఆర్. వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింలు, మాజీ జడ్పీటీసీ కొండల్ రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



77 వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు శ్రీ షబ్బీర్ అలీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ జెండా ఎగురవేసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు శ్రీ షబ్బీర్

# బద్వేలు డిపో మేనేజర్ కు ఉత్తమ అవార్డు



పోరుమామిళ్ల(భారతశక్తి ప్రతినిధి) జనవరి 26: బద్వేలు డిపో మేనేజర్ చైతన్య నిరంజన్ 77 వ గణతంత్ర దినోత్స వ వేడుకల్లో భాగంగా కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ చేతుల మీదుగా బెస్ట్ అవార్డు అందుకున్నారు. బద్వేలు డిపో అభివృద్ధి తో పాటు,ప్రజలకు కార్గో సేవలు, పచ్చ దనం పరిశుభ్రత,బస్సుల్లో ఇంధన పొదుపు, ప్రజల కు అందిస్తున్న సేవలను గుర్తించిన జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ గుర్తించి కడప రీజియన్ లొనే ఉత్తమ బెస్ట్ బద్వేలు డిపో గా గుర్తించి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మేనేజర్ చైతన్య నిరంజన్ మాట్లా డుతూ ఎప్పుడు బద్వేలు డిపోకు ఒక్క అవార్డు రాలేదని, తాను వచ్చాక డిపో అభివృద్ధి కి పెద్ద పీతవేసి, బస్సుల్లో ఒక ప్రక్క ఇంధన పొదుపు,మరొక ప్రక్క కార్గో సేవలు విస్తృతంగా ప్రజల ముంగిటకు తీసుకెళ్లడం,బస్టాండులలో పచ్చదనం పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం వలన ఈ అవార్డు లభించిందన్నారు. ఇంకా సేవలు విస్తృతంగా పెంచుతామన్నారు. బద్వేలు డిపోకు అవార్డు రావడం పట్ల ఆర్టీసీ సిబ్బంది అభినందనలు తెలిపారు.

# రైతులకు యూరియా పంపిణి కార్యక్రమం లో పాల్గొన్న బద్వేల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ సుప్రజ

పోరుమామిళ్ళ, భారత శక్తి ప్రతినిధి, జనవరి 26: బికోదూర్ మండలం పాయలకుంట్ల గ్రామ రైతుసేవ కేంద్రం లో రైతులకు యూరియా పంపిణి కార్యక్రమం లో పాల్గొని , ఎన్ డి ఎ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను రైతులు అందరు వినియోగించుకోవాలని , వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన పొందే విధంగా సహకరించాలని కోరారు . ఇందులో అగ్రికల్చర్ అసిస్టెంట్ తాసిన్ , రైతులు , బీజేపీ నాయకులు రవిచంద్ర , నాగేంద్ర , రామసుబ్బారెడ్డి , ఎ ఎం సి డైరెక్టర్ ప్రతాప్ , సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు .



# ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

## జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అదనపు కలెక్టర్ విక్టర్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 26: 77 వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేసి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

వైద్య ఆరోగ్య శాఖ, అగ్నిమాపక శాఖల శకటాలను తిలకించిన అనంతరం వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి గురించి తన ప్రసంగం ద్వారా తెలియజేశారు. వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి , వివిధ శాఖల లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంస పత్రాలను అందజేశారు. అనంతరం శాఖల ప్రగతిపై ఏర్పాటుచేసిన స్టాళ్లను సందర్శించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవోలు పార్థ నరసింహా రెడ్డి, వీణ, ఆయా శాఖల జిల్లా అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

అంతకు ముందు కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.



# రెపరెపలాడిన మువ్వన్నెల జెండా.!

## - ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు.. -జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు

మణుగూరు, జనవరి 26 (భారతశక్తి) : 77వ భారత గణతంత్ర దినోత్సవాన్ని మండల వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, పార్టీ కార్యాలయాలు, ప్రధాన కూడళ్ల వద్ద మూడురంగుల జెండాను అధికారులు, ఎమ్మెల్యే, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఎగురవేశారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం (ప్రజా భవన్), కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ భవనం నియోజకవర్గ కార్యాలయం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు జాతీయ జెండాను ఆవిష్కరించారు. మణుగూరు సబ్ డివిజనల్ కార్యాలయంలో, ఎస్.హెచ్.ఓ కార్యాలయంలో సిఐ నాగబాబు, అశ్వాపురం సిఐ అశోక్ రెడ్డి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఎమ్ఈఓ స్వర్ణ జ్యోతి, ఎంపిఓ వెంకటేశ్వరరావు, ఐకెపి అధికారి, తహశీల్దార్ అద్దంకి నరేష్, కమిషనర్ ప్రసాదరావు తమ తమ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. రేణుక చౌదరి క్యాంపు కార్యాలయంలో అక్షర మహిళ మండలి సభ్యులు, ప్రవేట్ విద్య సంస్థలు, త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ముందుగా మణుగూరు డిఎస్పీ కార్యాలయం, ఎస్.హెచ్.ఓ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం మనకు అందించిన హక్కులు, బాధ్యతలను ప్రతి పౌరుడు అవగాహన చేసుకుని దేశ నిర్మాణంలో భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల



ప్రాణ త్యాగాలను స్మరించుకుంటూ, రాజ్యాంగ విలువలను కాపాడుకుంటూ ప్రజాస్వామ్య బలోపేతానికి అందరూ కలిసి ముందుకు సాగాల్సిన అవసరం ఉందని తెలిపారు. వారి జ్ఞాపకాలను స్మరించుకుంటూ.. ఆశయాలకనుగుణంగా నడ్చుకోవాలని సూచించారు. నియోజకవర్గ ప్రజలందరికీ 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంలో తక్కువ కాలంలో ఎక్కువ అభివృద్ధి జరిగిందన్నారు. నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టె సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రభుత్వ, ప్రవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు, ఉపాధ్యాయులు, ప్రజా, గిరిజన, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిస్వార్థ సేవకు ఆప్తాల్మిక్ అధికారికి దక్కిన సత్కారాలు

## కలెక్టర్, ఐటిడిఏ పిఓ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు

మణుగూరు, జనవరి 26 (భారతశక్తి) : నిస్వార్థంగా ప్రజలకు సేవలు అందించిన ఆప్తాల్మిక్ అధికారి గంజికుంట్ల సంజీవరావుకు భద్రాచలం ఐటీడీఏ పిఓ రాహుల్, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందుకున్నారు. సోమవారం భద్రాచలం ఐటీడీఏ, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో భద్రాచలం, పినపాక నియోజకవర్గం స్థాయిలో అత్యధిక కంటి ఆపరేషన్లు చేయించినందుకు ప్రశంస పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆప్తాల్మిక్ ఆఫీసర్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో గత 30 సంవత్సరాల నుండి అంధత్వ నిర్మూలన కొరకు విశేషంగా కృషి చేస్తూ దాదాపు 15 వేల మందికి కంటి ఆపరేషన్లు చేయించి ఎంతో మంది కంటికి వెలుగు నిచ్చారన్నారు. వందల కొద్ది మండల స్థాయి మెగా నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించి, కంటి ఆపరేషన్ల అవసరమగు వారిని ఖమ్మం, వరంగల్,హైదరాబాద్, భీమవరం, లాంటి సుదూర ప్రాంతాలకి బస్సుల ద్వారా, రైళ్ల ద్వారా తీసుకువెళ్లి కంటి ఆపరేషన్లు చేయించడం జరిగిందని తెలిపారు. గత రెండు సంవత్సరాల నుండి సుమారు 2350 మందికి కంటి ఆపరేషన్లు



చేయించి డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, జిల్లా కలెక్టర్ జతేష్ వి పాటిల్, ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ బి రాహుల్ గారి ప్రశంసలు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. సంజీవరావు సేవలను ప్రత్యేకంగా గుర్తించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు, జిల్లా కలెక్టర్ జతేష్ వి పాటిల్ రాష్ట్ర గవర్నర్ కి డాక్టర్ రవిబాబు, సంజీవరావు పేర్లను సిఫారసు చేయడం జరిగినదన్నారు.

# సినిమా

## సంక్రాంతి తర్వాత థియేటర్‌లో అలరించడానికి వస్తున్న చిత్రాలివే..!

### * భర్త అహంకారం.. భార్య ప్రతీకారం




తనపై పెత్తనం చెలాయించే భర్తకి ఓ భార్య ఎలా బుద్ధి చెప్పింది.. అతడి అహంకారాన్ని ఎలా అణిచింది అనే నేపథ్యంలో సాగే కథ 'ఓం శాంతి శాంతి శాంతిః'. తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా జంటగా నటించిన ఈ సినిమాని ఏఆర్ సజీవ్ తెరకెక్కించారు. ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ సంస్థలు నిర్మించాయి. బ్రహ్మాజీ, సురభి ప్రభావతి తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. జనవరి 30న థియేటర్లలోకి రానుంది.

### మాటల్లేని సినిమా..




టాకీ యుగం ప్రారంభమైన తర్వాత వచ్చిన అతి తక్కువ ప్రయోగాత్మక చిత్రాల్లో 'పుష్పక విమానం' ఒకటి. ఆ కోవలో మళ్లీ ఇన్నేళ్ల తర్వాత మూవీ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది 'గాంధీ టాక్స్'.విజయ్ సేతుపతి, అదితీరావ్ హైదరీ, అరవింద్ స్వామి ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రమిది. కిశోర్ పాండురంగ్ బేలేకర్ దర్శకత్వం వహించారు. ఇప్పటికే పలు చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై ప్రశంసలు అందుకుందీ సినిమా. ఈ నెల 30న థియేటర్లలో విడుదల కానుంది. ఏఆర్ రెహమాన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు.

### మరోసారి పోలీసు అధికారిణిగా..




మహిళల అక్రమ రవాణా.. కిడ్నాప్ లాంటి అంశాలతో రూపొంది మంచి హిట్ బొమ్మ అనిపించుకున్నాయి 'మర్దానీ' చిత్రాలు. ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్ రాజ్‌ఫిల్మ్స్ నిర్మించిన ఈ సినిమాలు ఇప్పటికే రెండు భాగాలుగా విడుదలై ప్రేక్షకుల్ని మెప్పించాయి. తాజాగా ఈ ఫ్రాంఛైజీలో 'మర్దానీ 3' రాబోతోంది. రాణి ముఖర్జీ మరోసారి పోలీసు అధికారిణి శివానీ రాయ్ పాత్రలో కనిపించనున్నారు. జనవరి 30న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

### బంగారం వేటకు వేళాయె..




'తుంబాడ్' వంటి వైవిధ్యమైన కథతో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచిన దర్శకుడు రాహి అనిల్ బార్వే. ఇప్పుడు మరో సరికొత్త కథాంశంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఆయన దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'మయసభ'. జావేద్ జాఫ్రీ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జనవరి 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'బంగారం వేటకు మీకు స్వాగతం' అంటూ చిత్ర బృందం విడుదల చేసిన ప్రచార చిత్రం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. వీణా జామ్కర్, దీపక్ దామ్లే తదితరులు నటిస్తున్నారు.



## అదే పెద్దలోటు


బాలీవుడ్ నటుడు ధర్మేంద్రకు కేంద్రం దేశ రెండో అత్యున్నత పురస్కారమైన పద్మ విభూషణ్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై ఆయన భార్య హేమ మాలిని ఆనందం వ్యక్తంచేశారు. అవార్డు అందుకోవడానికి ఆయన మన మధ్యలేకపోవడం బాధగా ఉందన్నారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా ఆమె స్పందించారు.. ''మా కుటుంబం మొత్తం చాలా సంతోషంగా ఉంది. ధర్మేంద్ర ఈ పురస్కారానికి అర్హుడు. అభిమానులు, సినీ పరిశ్రమకు చెందినవారంతా ఇప్పుడు ధర్మేంద్ర గురించి, ఆయన చేసిన మంచి పనుల గురించి మాట్లాడుకుంటున్నారు. అవి వింటుంటే మా హృదయాలు ఆనందం, గర్వంతో నిండిపోతున్నాయి. ఆయనకు పద్మ విభూషణ్ పురస్కారం రావాలని ఎంతోమంది కోరుకున్నారు. ఆయన ఎప్పుడూ అవార్డుల కోసం పని చేయలేదు. తన పాత్రకు పూర్తి న్యాయం చేయాలని నిరంతరం శ్రమించారు. ఎంతోమందికి స్ఫూరిగా నిలిచారు. ఆయనకు జీవిత సాఫల్య పురస్కారాలు తప్ప ఒక్క ఫిల్మ్‌ఫేర్ కూడా రాలేదు. ఇప్పుడు ఇంత పెద్ద అవార్డును తీసుకోవడానికి ఆయన మన మధ్య లేకపోవడం బాధాకరం. ఆయనతో వర్క్ చేసినవారంతా కూడా ప్రస్తుతం ఈ బాధలోనే ఉన్నారు'' అని హేమ మాలిని అన్నారు.

## నా ఫోన్ ఎత్తలే

టాలీవుడ్‌లో ఒక వెలుగు వెలిగి స్టార్‌హీరోలందరి సరసన నటించిన ముద్దుగుమ్మ రకుల్‌ప్రీత్‌సింగ్. ఆ తర్వాత బాలీవుడ్‌కు షిఫ్ట్ అయిన ఈ అమ్మడు దే దే ప్యార్ దే, రన్ వే 34, డాక్టర్ జీ వంటి సినిమాలతో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం 'పతి పత్నీ ఔర్ వో' అనే చిత్రంలో నటిస్తోంది. దర్శకుడు శంకర్ నుంచి ఇండియన్ 3 గురించిన అప్ డేట్ రావాల్సి ఉంది. ఇక తన కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న చేదు అనుభవాలను తాజాగా ఇంటర్వ్యూలో పంచుకుంది రకుల్. తాను బాలీవుడ్‌కు కొత్తగా వచ్చినప్పుడు ఎవరూ తెల్వదని.. క్యాస్టింగ్ డైరెక్టర్లకు ఫోన్ చేస్తే వారు కనీసం ఆన్సర్ కూడా చేసేవారు కాదని పేర్కొంది. ఒకవేళ పొరపాటున ఫోన్ ఎత్తినా, చాలా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చేవారని ఆవేదన వ్యక్తం చేసింది. 'ఒక ఆడిషన్ కోసం లేదా ఒక చిన్న అవకాశం కోసం ఆఫీసుల చుట్టూ తిరగడం, గంటల తరబడి వేచి చూడటం వంటివి నా మానసిక ధైర్యాన్ని పరీక్షించాయి. మనం బయటి వ్యక్తులం కాబట్టి మనకు రెడ్ కార్పెట్ వెల్‌కమ్ ఉండదు. ప్రతి అడుగులోనూ మనల్ని మనం నిరూపించుకోవాలి. తెలుగులో టాప్ హీరోయిన్‌గా ఉన్నప్పుడు కూడా బాలీవుడ్ ఫిలిం మేకర్స్ నన్ను ఒక కొత్త నటిగానే చూశారు. దక్షిణాదిలో నేను పెద్ద స్టార్ అని వారికి తెలుసు.. కానీ హిందీ మార్కెట్ లెక్కలు వేరు. అక్కడ మళ్లీ సున్నా నుంచి మొదలుపెట్టాల్సి వచ్చింది' అంటూ చెప్పుకొచ్చింది.



## రెబెల్ లుక్



వర్సటైల్ యాక్టర్ మంచు మనోజ్ సెకండ్ ఇన్నింగ్స్‌లో వరుస సినిమాలతో దూసుకెళ్తున్నాడు. ఇటీవలే 'భైరవం', 'మిరాయ్' చిత్రాలతో ప్రేక్షకులను అలరించి మంచి సక్సెస్ అందుకున్నాడు. ప్రస్తుతం ఆయన హీరోగా తెరకెక్కుతున్న పీరియాడికల్ యాక్షన్ మూవీ 'డేవిడ్ రెడ్డి'. హను మరెడ్డి యక్కంటి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో మనోజ్ ఫస్ట్‌లుక్‌ను తాజాగా విడుదల చేశారు మేకర్స్. పోస్టర్‌లో మునుపెన్నడూ చూడని విధంగా అత్యంత క్రూరమైన అవతారంలో కనిపిస్తూ సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసేలా ఉంది. పోస్టర్‌రిలీజ్‌సందర్భంగా మనోజ్ పెట్టిన క్యాప్షన్ కూడా హాట్ టాపిక్‌గా మారింది. 'నాలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించే పాత్ర. ఎంతో క్రూరమైన, క్షమాగుణం లేనిది' అంటూ క్యాప్షన్ ఇచ్చాడు. ఇక ఇందులో మనోజ్ సరసన మరియా హీరోయిన్ గా నటిస్తోంది. కేజీఎఫ్‌ఫేమ్‌రవి బస్రూర్‌మ్యూజిక్‌అందిస్తున్నాడు. వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్ బ్యానర్‌పై మోత్కూరి భరత్, నల్లగంగుల వెంకట్ రెడ్డి సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

## ఆసక్తికర టైటిల్‌తో రవితేజ.. ఫస్ట్‌లుక్ రిలీజ్

ఇటీవల 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'తో హిట్ అందుకున్నారు హీరో రవితేజ. ఇప్పుడు అదే జోష్‌తో మరో సినిమా పనుల్లో బిజీ అయ్యారు. ఆయన కథానాయకుడిగా శివ నిర్వాణ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే. నేడు ఈ హీరో పుట్టినరోజు సందర్భంగా దాని టైటిల్‌ను ప్రకటించారు. 'ఇరుముడి'గా ఇది రానున్నట్లు తెలిపారు. ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను పంచుకుంటూ చిత్రనిర్మాతలు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. ''కొన్ని కథలు జీవితంలో సరైన సమయంలో మనల్ని ఎంచుకుంటాయి. అలాంటి ఒక కథే ఈ ఇరుముడి. ఇందులో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నా. కొత్త ప్రయాణంలో ఉత్సాహంగా ఉన్నా'' అని రవితేజ తెలిపారు. ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇందులో కథానాయికగా ప్రియా భవానీ శంకర్ నటిస్తుండగా.. జీవీ ప్రకాశ్ సంగీతం అందిస్తున్నారు. ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో రవితేజ అయ్యప్ప మాలధారణలో కనిపిస్తున్నారు. దీని ఆధారంగా చూస్తే..బలమైన కథతో భక్తికి ప్రాధాన్యమిచ్చే చిత్రంగా ఇది రానున్నట్లు తెలుస్తోంది. రవితేజ 77వ చిత్రంగా ఇది రానుంది.



# ఘనంగా ఆరే మరారి సంఘం కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం



ఆదిలాబాద్ జిల్లా, జనవరి 26, (భారతి శక్తి న్యూస్) : ఇచ్చోడ మండల కేంద్రంలో ఆరే మరాఠి సంఘం కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించుకున్నారు. అడెగామా(బి) రోడ్డులో ఏర్పాటు చేసుకున్న సంఘం కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించుకున్నారు . కుల పెద్దలు రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆరే మరాఠి సంఘం ఇచ్చోడ అధ్యక్షులు సాయికిరణ్ జాధవ్,ఉపాధ్యక్షులు పాన్పట్టే సుభాష్, అశోక్ భోస్లే, పరమేశ్వర్ షిందే, తానాజీ థోరే, జనరల్ సెక్రటరీ పౌడే అనిల్,కోశాధికారులు గైక్వాడ్ జ్ఞానేశ్వర్, మెండల్కర్ లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీ చంద్రకాంత్ కదం, శ్యామ్ దుక్రే, దినేష్ గైక్వాడ్, కదం శంకర్, రాము జాధవ్, శివకాంత్ కదం , సభ్యులు పాన్పట్టే సాయికృష్ణ, సందీప్ కదం అడ్వైసర్ కమిటి సభ్యులు శంకర్ పాటిల్ ఖరే, సూర్యకాంత్ పాటిల్ చౌహాన్, మనోహర్ పాటిల్ దుక్రే, సుదర్శన్ పాటిల్ కదం,గంగాధర్ పాటిల్ షిందే అరుణ్ పాటిల్ అగ్లవే, కొండిరాం పాటిల్ కదం, కిషన్ పాటిల్ షిందే, జ్ఞానోబా పాటిల్ కదం తదితరులు పాల్గొన్నారు.



# రూ.17 లక్షల విలువైన 64 మొబైల్ ఫోన్లు రికవరీ

మేడ్చల్, భారత శక్తి ప్రతినిధి, జనవరి 26: పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోయిన రూ.17 లక్షల విలువైన 64 మొబైల్ ఫోన్లను పోలీసులు విజయవంతంగా గుర్తించి, పేట్ బషీరాబాద్ పీఎస్ లో ఈరోజు వాటిని సంబంధిత యజమానులకు తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి మాట్లాడుతూ ఫిర్యాదుల ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి మొబైల్ ఫోన్లను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మొబైల్ ఫోన్ పోయిన వారు వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు, కేంద్ర ప్రభుత్వ సీఈఐఆర్ పోర్టల్‌లో తమ మొబైల్ వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఏసీపీ వెంట పేట్ బషీరాబాద్ పీఎస్ ఎస్‌హెచ్‌వో కె. విజయ వర్ధన్, డీఐ డి. అజయ్ కుమార్, డీఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.




# చైతన్యపురి పోలీస్ స్టేషన్లో గణతంత్ర వేడుకలు

ఎల్బీనగర్, జనవరి 26 (భారత శక్తి): 77 వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ చైతన్యపురి పోలీస్ స్టేషన్ నందు సీఐ సైదులు సోమవారం జాతీయ జెండావిష్కరణ చేశారు.ఈ కార్యక్రమంలో డిఐ గురుస్వామి, ఎస్ఐలు పి.భద్రయ్య, సి. వెంకటయ్య, వి. ప్రభాకర్,ఎం. గోవర్ధన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది అందరూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సిబ్బందికి భారత రాజ్యాంగం దేశానికి ఒక మార్గ దర్శక గ్రంథం అని, ప్రతి పౌరుడికి అనగా ధనిక, పేద, బలవంతుడు, బలహీనుడికి అందరికీ సమాన స్వేచ్ఛ & హక్కులు కలవని ప్రతీ ఒక్కరికీ భారత రాజ్యాంగం పట్ల అవగాహన ఉండాలనీ తమ విధులు, బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించాల్సిన అవసరం ఉందని సిబ్బందికి సీఐ సైదులు తెలియజేశారు.

# దేశ ఐక్యతకు , సమగ్రత కు అందరు పాటుపడాలి

**: బద్వేల్ ఏ ఎం సి చైర్మన్ నారిశెట్టి సుప్రజ**

పోరుమామిళ్ళ (భారత శక్తి ప్రతినిధి) జనవరి 26:బద్వేల్ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించి, జెండా వందనం చేసి ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మార్కెట్ యార్డ్ చైర్మన్ సుప్రజ ఈ సందర్భంగా చైర్మన్ సుప్రజ గారు మాట్లాడుతూ, పరాయిపాలన నుండి ఎంతో మంది త్యాగధనుల పోరాటం ద్వారా భారతదేశానికి విముక్తి పొంది స్వాతంత్ర్యాన్ని తీసుకువచ్చి, పటిష్టమైన రాజ్యాంగ రూపకల్పన ద్వారా ప్రజలందరికీ స్వేచ్ఛా సమానత్వాన్ని అందించిన రోజు 26 జనవరి 1950 తేదీని



గణతంత్ర దినోత్సవంగా జరుపుకోవడం సంతోషమని, ప్రతి పౌరుడు నా దేశం నా బాధ్యత అనే విధంగా దేశాన్ని రక్షించుకోవడం, దేశం పట్ల గౌరవాన్ని పెంపొందించుకోవడం ద్వారా సమానత్వాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ పాలకవర్గం సభ్యులు సెట్టమ్ ప్రతాప్ ,చిన్ని సుబ్బారావు, శివశంకర్ , కుప్పయ్య,నాగరాజు ,హుస్సేనమ్మ ,వెంకటసుబ్బయ్య , బొమ్మనా ప్రతుషా ,అధికారులు, సిబ్బంది,బీజేపీ లీడర్స్ రామసుబ్బారెడ్డి , నాగేంద్ర తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# కలెక్టరేట్ లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, జనవరి 26: కలెక్టరేట్లో 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు.అనంతరం జాతీయ గీతాలాపనతో పాటు తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ... భారత రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు, బాధ్యతలు కల్పిస్తుందని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రతి ఉద్యోగి



నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, పాండు, జిల్లా అధికారులు, విద్యార్థులు, కలెక్టరేట్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



ఎల్బీనగర్ నియోజకవర్గం చైతన్యపురి డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్ లో 77 వ గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. గణతంత్ర వేడుకలో ముఖ్యఅతిధిగా రాష్ట్ర రెడ్డి సంఘాల జేఏసీ అధ్యక్షులు బద్దూరి వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొని జాతీయ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్, జనవరి 26 (భారత శక్తి):



హస్తినాపురం డివిజన్ వందనపురి కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షులుగా నల్లవెల్లి మనోహర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మునగాల స్వామిరావు, కోశాధికారిగా చల్లా వేణుగోపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు జంగయ్య, లక్ష్మారెడ్డి,సహాయ కార్యదర్శిగా కండెకర్ శంకర్ జి.గోపాల్,ఎడ్ల రవీందర్,గౌరవ అధ్యక్షులు కర్నాటి చండీశ్వర్ గౌరవ సలహా దారులుగా ఎం శ్రీనివాస్, పత్యనాయక్, ఈసి మెంబెర్స్ గా సింధురెడ్డి, విజయ్, మల్లేష్, గౌడ్, అశోక్, నందు నాయక్ లు నియమితులు అయ్యారు. నూతన కమిటీని కార్పొరేటర్ సుజాత నాయక్ అభినందించారు.

ఎల్బీనగర్, జనవరి 26 (భారత శక్తి ):

# ద్విచక్ర వాహనాల దొంగల అరెస్ట్

*** రూ.50 లక్షల విలువైన బైకుల స్వాధీనం**




మేడ్చల్, భారత శక్తి ప్రతినిధి, జనవరి 26: సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న నిందితులను మేడ్చల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మేడ్చల్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి మాట్లాడుతూ మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బైకు చోరీలు అధికంగా నమోదవడంతో ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈ క్రమంలో ఈరోజు ఇద్దరు నిందితులను అరెస్టు చేశామన్నారు. వీరు మొత్తం 18 బైకు చోరీలు చేసినట్లు విచారణలో ఒప్పుకున్నారని తెలిపారు. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 15, దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2, పేట్ -బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు నమోదయిందన్నారు. బీఎన్ఎస్ సెక్షన్ 303(2) కింద నమోదు చేశామన్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా, మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని తెలిపారు. అరెస్టైన నిందితుల నుంచి సుమారు రూ.50 లక్షల విలువైన వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 12 రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకులు, 5 పల్సర్ బైకులు, ఒక ఎఫ్‌జెడ్ వాహనం, ఒక వెండి కుంకుమ భరణి, ఒక వైర్ కట్టర్, ఒక మాస్క్, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారన్నారు. ప్రజలు తమ వాహనాలను సురక్షిత ప్రదేశాల్లో పార్క్ చేసుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.



77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పలు డివిజన్లలో ఘనంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకల్లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, భారత రాజ్యాంగం మనకు సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం అనే విలువలను అందించిందని పేర్కొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం ప్రతి పౌరుని బాధ్యతని తెలిపారు. దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.వేడుకల అనంతరం దేశ స్వాతంత్ర్యం, గణతంత్ర సాధనకు ప్రాణత్యాగం చేసిన మహనీయులకు ఆయన ఘన నివాళులు అర్పించారు.

ఎల్బీనగర్, జనవరి 26 (భారత శక్తి):



నాగోల్ పోలీస్ స్టేషన్ సీఐ మహ్మద్ మక్బూల్ జానీకి గణతంత్ర దినోత్సవం సందర్భంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు.

ఎల్బీనగర్, జనవరి 26 (భారత శక్తి):



77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో కాలనీవాసులు ఘనంగా నిర్వహించిన జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలలో గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథిగా, బీజేపీ యువ నాయకుడు సందీప్ టీంకు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ కాలనీ అసోసియేషన్ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్, జనవరి 26 (భారత శక్తి):

# రాక్ టౌన్ కాలనీలో 'రథసప్తమి' శోభ : 108 సూర్యనమస్కారాలతో యోగా సాధన

: 108 సూర్యనమస్కారాలతో యోగా సాధన

* ఆరోగ్యమే మహాభాగ్యం: కాలనీ ప్రెసిడెంట్ వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు.

* రెండేళ్లుగా నిరంతరాయంగా శిక్షణ.. మధుసూదన్ రెడ్డి కృషి అమోఘం






నాగోల్ (హైదరాబాద్) , జనవరి26: (భారత శక్తి): రాక్ టౌన్ కాలనీలో రథసప్తమి పర్వదినం ఆధ్యాత్మిక, ఆరోగ్య సందడిని నింపింది. సూర్య భగవానుడి జన్మదినాన్ని పురస్కరించుకుని కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 108 సూర్యనమస్కారాల కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. కాలనీ ప్రెసిడెంట్ వినోద్ రెడ్డి ప్రత్యేక పర్యవేక్షణలో, యోగా గురువు మధుసూదన్ రెడ్డి నేతృత్వంలో సుమారు 100 మంది సాధకులు ఏకకాలంలో సూర్యనమస్కారాలు చేసి తమ భక్తిని, ఆరోగ్య దీక్షను చాటుకున్నారు.

**సంకల్పం - సాధన - ఆరోగ్యం:**

గత రెండు సంవత్సరాలుగా కాలనీ కమ్యూనిటీ హాల్ వేదికగా సాగుతున్న యోగా శిక్షణలో వందలాది మంది ఆరోగ్యాన్ని పొందుతున్నారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ వినోద్ రెడ్డి మాట్లాడుతూ.. కాలనీ వాసుల సంక్షేమం కోసం సామాజిక కార్యక్రమాలతో పాటు ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. యోగా ద్వారా దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం పొందుతున్న వారిని చూస్తుంటే సంతోషంగా ఉందని, భవిష్యత్తులో యోగా తరగతులకు అసోసియేషన్ తరపున మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

**వైభవంగా సన్మాన కార్యక్రమం**

ఈ కార్యక్రమంలో యోగా సాధకులంతా కలిసి రాక్ టౌన్ నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం సూర్య భగవానుడి ప్రసాదంగా ఆరోగ్యకరమైన రాగి జావ, మొలకలను పంపిణీ చేశారు. యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాదని, అది ఒక జీవన విధానమని గురువు మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు.

**ఈ వేడుకలో పాల్గొన్న ముఖ్యులు**

ప్రెసిడెంట్ వినోద్ రెడ్డితో పాటు జైపాల్ రెడ్డి, మణిపాల్ రెడ్డి, రాంచంద్రా రెడ్డి, సంజీవ రెడ్డి, సంపత్ కుమార్, శ్రీలేక, సుదర్శన్ చారి, శేఖర్ రెడ్డి మరియు పెద్ద సంఖ్యలో కాలనీ మహిళలు, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.



## సాయినగర్‌లో బోర్ వెల్ పనులు ప్రారంభం

* రూ. 6 లక్షల ఎమ్మెల్సీ నిధులతో నిర్మాణం

* ప్రారంభించిన మధుయాష్కీ గౌడ్, దయానంద్ గుప్తా..

చైతన్యపురి, జనవరి 26 (భారత శక్తి) : స్థానిక సాయినగర్ కాలనీ వెల్ఫేర్ భవనం ఆవరణలో నూతన బోర్ వెల్ పనులను టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ సోమవారం ప్రారంభించారు. కాలనీవాసుల తాగునీటి అవసరాల కోసం ఎమ్మెల్సీ దయానంద్ తన కోటా నిధుల నుంచి రూ. 6 లక్షలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ ప్రెసిడెంట్ సురేందర్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి, నాయకులు బద్దూరి వెంకటేశ్వర్ రెడ్డి, బొగ్గారపు శరత్ చంద్ర, దాము మహేందర్ యాదవ్, రాహుల్ జైన్, నవీన్ చారి పాల్గొన్నారు. అలాగే కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు లక్ష్మణాచారి, వేణుగోపాల చారి, అరవింద్ రెడ్డి, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

## తొర్రూరులో ఆధ్యాత్మిక శోభ..
## ధగధగలాడిన సుదర్శన మహా హోమ జ్వాలలు!

తుర్కయంజాల్ (తొర్రూరు) జనవరి26: (భారత శక్తి): సూర్య భగవానుడి జన్మదినమైన రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని రంగనాయక స్వామి సన్నిధి భక్తిపారవశ్యంలో మునిగిపోయింది. జిహెచ్ఎంసి పరిధిలోని తొర్రూరు గ్రామంలో వెలసిన శ్రీ రంగనాయకి సమేత రంగనాయక స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన 12 సుదర్శన మహా హోమాలు కనువిందు చేశాయి.



**వేదమంత్రాల మధ్య పూర్ణాహుతి:**

ప్రముఖ అర్చకులు శ్రీధర్ అయ్యగారు నేతృత్వంలో శాస్త్రోక్తంగా ఈ హోమ క్రతువు జరిగింది. లోక కళ్యాణార్థం, భక్తుల అభ్యున్నతి కోసం పన్నెండు హోమ గుండాల వద్ద ఏకకాలంలో నిర్వహించిన ఈ పూజలతో ఆలయ పరిసరాలు వేదమంత్రోచ్చారణలతో మారుమోగాయి. ఉదయం నుంచే స్వామివారికి విశేష అభిషేకాలు, అలంకరణలు పూర్తి చేసిన అనంతరం హోమ క్రతువును అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

**ముఖ్య అతిథిగా ఆర్.అండ్.బి చైర్మన్:**

ఈ ఆధ్యాత్మిక వేడుకలో తెలంగాణ రాష్ట్ర ఆర్ అండ్ బి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హోమ గుండం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాచీన సంస్కృతిని, ఆధ్యాత్మిక విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

**పోటెత్తిన భక్తజనం:**

దేవాలయ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు మరియు సభ్యుల సమన్వయంతో ఏర్పాట్లు అత్యంత ఘనంగా జరిగాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూ లైన్లు, ప్రసాద వితరణ ఏర్పాట్లు చేశారు. స్థానిక గ్రామస్తులే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం జనసందోహంగా మారింది.



## దత్తాత్రేయ కాలనీలో పర్యటించిన
## కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

ఎల్బీనగర్, జనవరి 20 (భారత శక్తి): హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి నేడు కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు డివిజన్‌లోని దత్తాత్రేయ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు గత ఐదు సంవత్సరాలుగా కాలనీ అభివృద్ధికి ఎల్లవేళలా సహకారం అందిస్తూ నిరంతరం కృషి చేస్తున్న కార్పొరేటర్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే కాలనీలో కొంతమేర భూగర్భ డ్రైనేజ్ పైప్‌లైన్ కొరత ఉందని కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ, గత ఐదు సంవత్సరాలుగా డివిజన్‌లోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ భూగర్భ డ్రైనేజ్, మంచినీటి పైప్‌లైన్లు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టామని తెలిపారు. తమ పదవీ కాలంలోనే దత్తాత్రేయ కాలనీలో మిగిలి ఉన్న కొద్దిపాటి భూగర్భ డ్రైనేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులను కూడా పూర్తి చేస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దత్తాత్రేయ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్
## మహిళ న్యాయ కళాశాలలో గణతంత్ర దినోత్సవం

* ముఖ్యఅతిథిగా మాజీ సీబీఐ అధికారి వివి లక్ష్మీనారాయణ



ఎల్బీనగర్,జనవరి 26 (భారత శక్తి): తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా న్యాయ కళాశాల 77వ గణతంత్ర దినోత్సవాన్ని గొప్ప ఉత్సాహంతో, దేశభక్తితో జరుపుకున్నారు. , అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ & మాజీ జాయింట్ డైరెక్టర్ (సీబీఐ అధికారి) వి.వి. లక్ష్మీనారాయణ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తమ ఉపన్యాసంతో పిల్లలకు న్యాయవాదులుగా ఏ విధంగా తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలో కూలంకుషంగా చెప్పి వారిలో ఉత్సాహాన్ని నింపారు. అలాగే తెలంగాణ హైకోర్టు న్యాయవాది ఉదయ్ కాంత్ కంపల్లి తమ ఉపన్యాసంతో న్యాయవాది వృత్తిపై ఎంతో గౌరవాన్ని పెంపొందించుకునే విధంగా పిల్లలకు మార్గ నిర్దేశకత్వాన్ని చేశారు. టీజీఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ శ్రీమతి కె. నిర్మల రంగారెడ్డి స్టేట్ ఆఫీసర్, శ్రీమతి ఎన్. రజిని, ఎంజెడ్ II ఆఫీసర్, శ్రీమతి వి. లక్ష్మాంజలి దేవి, జోన్ VI అధికారి శ్రీమతి డాక్టర్ సిహెచ్.మానస ప్రిన్సిపాల్, పి. కవిత వైస్ ప్రిన్సిపల్ అందరూ రాజ్యాంగం పట్ల నిబద్ధతను, పౌరుల యొక్క బాధ్యతను వారి విధులను గుర్తు చేయడం జరిగింది. జాతీయ జెండాను ఆవిష్కరించడంతో వేడుక ప్రారంభమైంది. తరువాత మార్చ్ పాస్ట్ సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. కాలేజీ న్యాయ పరీక్షలలో అగ్రస్థానంలో నిలిచిన వారికి, రంగోలి విజేతలకు పతకాలు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను హైలైట్ చేసింది జాతీయ గౌరవాన్ని జరుపుకుంది. కళాశాల పరిపాలన అతిథులకు కృతజ్ఞతలు తెలిపింది ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో విద్యార్థులు అధ్యాపకుల కృషిని అభినందించింది.

## టింబర్ డిపో యజమాని అదృశ్యం



ఎల్బీనగర్, జనవరి 26 (భారత శక్తి): ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ బైరామల్ గూడ నివాసి ఈ నెల 17 వ తేది నుండి టింబర్ డిపో యజమాని రాకేష్ అగర్వాల్ అనే మార్వాడి, ఎలాంటి సమస్య లేకున్నా మొబైల్ స్విచ్చాఫ్ చేసి కనబడకుండా వెళ్ళిపోయాడు. బంధువులు, స్నేహితుల దగ్గర కూడా ఆయన ఆచూకీ తెలియక, కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్ లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ సీఐ వినోద్ కుమార్ ఆయన సిబ్బంది కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎవరికైనా రాకేష్ అగర్వాల్ ఆచూకీ తెలిస్తే 8712662351,8712662304 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## ఘనంగా వెంకటేశ్వర కాలనీ స్వర్ణోత్సవ వేడుకలు



ఎల్బీనగర్,జనవరి 26 (భారత శక్తి): సరూర్ నగర్ డివిజన్ పరిధిలోని, శ్రీ వెంకటేశ్వర కాలనీ స్వర్ణోత్సవ వేడికలు అంగరంగ వైభవంగా జరిగాయి. కాలనీ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన స్వర్ణోత్సవ జయంతి కార్యక్రమంలో హంపి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామీజీ సావనీర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ, ప్రతీ ఒక్కరూ అజ్ఞానాన్ని వీడి జ్ఞానం వైపు ప్రయాణం చేయాలని సూచించారు. మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, కాలనీ దినదిన అభివృద్ధి చెందుతూ డివిజన్లోని పెద్ద కాలనీగా అవతరించిందన్నారు. కాలనీ కమిటీ మెంబర్ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం సావనీర్ కు సహకరించిన ప్రతి ఒక్కరికి సన్మానం జరిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్ లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు గండు దనంరెడ్డి, శ్రీ వెంకటేశ్వర దేవాలయం చైర్మన్ దర్పల్లి అశోక్, ప్రధాన కార్యదర్శి బిజ్జాల కనకారావు, ఉపాధ్యక్షుడు మారోజు శ్రీనివాసరావు, కోశాధికారి సాయికిరణ్, కల్చరల్ సెక్రెటరీ విజయకుమార్, జాయింట్ సెక్రెటరీ మధుసూదన్ రెడ్డి, ఈసీ మెంబర్స్ శ్రీనివాస రావు, మునగాల నరేష్, సుధాకర్ చారి, గోవర్ధన్ రెడ్డి, సురేందర్ రాజు, తులసి కృష్ణమూర్తి, బాలరాజు గుప్తా, కృష్ణంరాజు, లింగారావు, కుమార్, చెన్నా అనిల్, ఎస్.కిరణ్ యాదవ్, వంశీ మోహన్, నవీన్ లతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి వేళ చెరువులో చిక్కుకుపోయిన వారిని కాపాడిన హైడ్రా-డీఆర్ఎఫ్

హైదరాబాద్, జనవరి 26(భారత శక్తి ప్రతినిధి) : హైదరాబాద్‌లోని మిరాలం చెరువులో చిక్కుకుపోయిన 9 మందిని హైడ్రాడీఆర్ఎఫ్ బృందాలు సురక్షితంగా కాపాడాయి. ఆదివారం అర్ధరాత్రి బోటు ఇంజన్ మొరాయించడంతో చెరువు మధ్యలోనే ఉండిపోయిన ఇంజనీర్లు, కార్మికులను సిబ్బంది ఒడ్డుకు చేర్చారు. పాతబస్తీలోని జూ పార్కు సమీపంలో చోటుచేసుకున్న ఈ ఘటన, తీవ్ర ఉత్కంఠకు దారితీసింది. వివరాల్లోకి వెళితే... మిరాలం చెరువుపై నిర్మించతలపెట్టిన వంతెన కోసం సాయిల్ టెస్ట్ చేసేందుకు కొంతమంది ఇంజనీర్లు, కార్మికులు ఆదివారం ఉదయం బోటులో చెరువులోకి వెళ్లారు. పనులు ముగించుకుని సాయంత్రం తిరిగి వస్తుండగా, చీకటి పడే సమయానికి వారు ప్రయాణిస్తున్న బోటు ఇంజన్ ఆగిపోయింది. దాన్ని బాగుచేయడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఒడ్డున ఉన్న మెకానిక్‌కు ఫోన్ చేయగా, బోటు ఒడ్డుకు వస్తేనే బాగుచేయగలనని చెప్పడంతో వారిలో ఆందోళన మొదలైంది. బోటును చేతులతో నెట్టుకుంటూ ఒడ్డుకు వద్దామని ప్రయత్నించగా, చెరువులో దట్టంగా పెరిగిన గుర్రపు డెక్క అడ్డుగా మారింది. దీంతో బోటు ముందుకు కదలలేదు. చుట్టూ చిమ్మచీకటి, మరోవైపు ఆ చెరువులో మొసళ్లు ఉంటాయనే భయంతో వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడిపారు. ఏం చేయాలో పాలుపోని స్థితిలో వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. పోలీసుల ద్వారా విషయం తెలుసుకున్న డీఆర్ఎఫ్ కంట్రోల్ రూమ్ వెంటనే స్పందించింది. హైడ్రా ఎస్ఎఫ్ఓ జమీల్, రెస్క్యూ టీమ్ ఇన్‌చార్జి స్వామి నేరుగా చెరువులో చిక్కుకున్నవారితో ఫోన్‌లో మాట్లాడారు. "మేము వస్తున్నాం, ఎంత రాత్రైనా మిమ్మల్ని సురక్షితంగా బయటకు తీసుకొస్తాం, ధైర్యంగా ఉండండి" అని భరోసా ఇచ్చారు. దట్టమైన చీకటి, గుర్రపు డెక్క కారణంగా బాధితులు ఉన్న ప్రదేశాన్ని గుర్తించడం డీఆర్ఎఫ్ సిబ్బందికి సవాలుగా మారింది. బాధితులు తమ సెల్ ఫోన్ లైట్ల ద్వారా సిగ్నల్ ఇవ్వగా, డీఆర్ఎఫ్ బృందాలు టార్చ్ లైట్ల సాయంతో అతి కష్టం మీద వారి వద్దకు చేరుకున్నాయి. మొదటి విడతలో నలుగురిని, ఆ తర్వాత రెండో విడతలో మిగిలిన ఐదుగురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ఒడ్డుకు చేరడంతో బాధితులంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రాణాపాయ స్థితిలో తమను కాపాడిన హైడ్రా డీఆర్ఎఫ్ బృందాలకు కన్నీళ్లతో కృతజ్ఞతలు తెలిపారు. నిరంతరం ఫోన్‌లో మాట్లాడుతూ ధైర్యం చెప్పడమే కాకుండా, సాహసోపేతంగా తమను కాపాడారని కార్మికులు, స్థానికులు కొనియాడారు.

## తెలంగాణలో ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు..

హైదరాబాద్, జనవరి 26(భారత శక్తి ప్రతినిధి) : తెలంగాణ వ్యాప్తంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అధికారిక కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. ఈ వేడుకలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్ బాబు, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హాజరయ్యారు. అంతకుముందు తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలిలో ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. రాష్ట్ర సచివాలయంతో పాటు జిల్లా కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లోనూ రిపబ్లిక్ డే వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధులను, రాజ్యాంగ నిర్మాతలను స్మరించుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో దేశభక్తి వాతావరణం

## బంగ్లాదేశ్‌లో హిందువులపై పెరుగుతున్న దాడులు...

బంగ్లాదేశ్, జనవరి 26 : బంగ్లాదేశ్‌లో మైనార్టీలు, ముఖ్యంగా హిందువులపై కొనసాగుతున్న హింసాత్మక దాడులు ఆ దేశంలోని భారతీయుల భద్రతపై తీవ్ర ఆందోళనలు రేపుతున్నాయి. గత కొన్నినెలలుగా అనేక ప్రాంతాల్లో హిందువుల ఇళ్లు, ఆలయాలు, ఆస్తులపై దాడులు జరుగుతున్నాయి. ఈ దాడుల్లో పలువురు మరణించారు, ఆస్తులు ధ్వంసమయ్యాయి. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో పనిచేస్తున్న భారతీయులు తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారు. ఫలితంగా, ప్రైవేట్ సెక్టార్ ఉద్యోగులతో పాటు కేంద్ర సంస్థల ఉద్యోగులు కూడా ఆ దేశాన్ని వీడుతున్నారు. భారత రాయబార కార్యాలయం సూచనల మేరకు చాలా మంది తమ కుటుంబ సభ్యులను ఇండియాకు పంపించారు. తాజా ఘటనలో, కేంద్ర విద్యుత్ రంగ సంస్థ ఎన్టీపీసీకి చెందిన 9 మంది ఇంజనీర్లు బంగ్లాదేశ్‌ను అకస్మాత్తుగా వీడి ఇండియాకు తిరిగి వచ్చారు. ఇండియా బంగ్లాదేశ్ మైత్రి ఒప్పందం కింద బంగ్లాదేశ్ ఇండియా ఫ్రెండ్‌షిప్ పవర్ కంపెనీ (BIFPCL) పేరిట నిర్వహిస్తున్న రాంపాల్ థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఈ ఇంజనీర్లు డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. అయితే, దేశంలో నెలకొన్న అల్లర్లు, హింసాత్మక ఘటనల నేపథ్యంలో వారు గత శనివారం భోమ్రా సరిహద్దు మార్గం ద్వారా ఇండియాకు చేరుకున్నట్టు తెలుస్తోంది. ఆసక్తికర విషయం ఏమిటంటే, వారు అక్కడి అధికారుల నుంచి అనుమతి తీసుకోకుండానే, నోటీసు ఇవ్వకుండానే దేశం వీడారు. పవర్ ప్లాంట్ అధికారులు తనిఖీ చేసినప్పుడు వారు విధులకు హాజరు కాలేదని తెలిసి ఆశ్చర్యపోయారు. బంగ్లాదేశ్‌లో గత ఆగస్టు 2024 నుంచి జూన్ 2025 వరకు హిందువులపై 2,442కు పైగా దాడి ఘటనలు జరిగాయని హిందూ బౌద్ధ క్రిస్టియన్ యూనిటీ కౌన్సిల్ (HBCUC) తెలిపింది. ఈ దాడులు రాజకీయ అస్థిరత, మత ఛాందసవాదం కారణంగా పెరుగుతున్నాయి. త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఈ హింస మరింత తీవ్రమవుతుందని హిందూ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

## భారత్‌తో మాది చారిత్రక బంధం రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలిపిన ట్రంప్

అమెరికా, జనవరి 26 : భారత్ 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రభుత్వానికి, ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచంలోనే అత్యంత పురాతన, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలుగా అమెరికా, భారత్‌ల మధ్య చారిత్రాత్మక బంధం ఉందని ఆయన కొనియాడారు. సోమవారం ట్రంప్ సందేశాన్ని భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ లో పంచుకుంది. "మీ 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమెరికా ప్రజల తరఫున భారత ప్రభుత్వానికి, ప్రజలకు నా హృదయపూర్వక అభినందనలు" అని ట్రంప్ తన సందేశంలో పేర్కొన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా భారత ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఏడాదిలో ఉమ్మడి లక్ష్యాల సాధనకు కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నట్లు ఆయన ఆకాంక్షించారు. "రక్షణ, ఇంధనం, కీలక ఖనిజాలు, అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ రంగాల్లో మన మధ్య బలమైన సహకారం ఉంది. క్వాడ్ వేదికగా బహుళస్థాయి భాగస్వామ్యంతో ఇరు దేశాలకు, ఇండో పసిఫిక్ ప్రాంతానికి ప్రయోజనం చేకూరుతోంది" అని రూబియో తన ప్రకటనలో వివరించారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి, దేశం సార్వభౌమ ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా అవతరించిన రోజుకు గుర్తుగా ప్రతి ఏటా జనవరి 26న గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటారు. రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్య సంప్రదాయాలను చాటుతూ దేశ రాజధాని ఢిల్లీలో జాతీయ పరేడ్, దేశవ్యాప్తంగా వేడుకలు నిర్వహిస్తారు.

## అమరావతిలో మొదటిసారిగా రిపబ్లిక్ డే వేడుకలు..

అమరావతి, జనవరి 26 (భారత శక్తి ప్రతినిధి) : ప్రజా రాజధాని అమరావతిలో తొలిసారిగా గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించడం ఒక చారిత్రాత్మక ఘట్టమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ ఏడాది రిపబ్లిక్ డే రాష్ట్ర ప్రజలకు ఎంతో గర్వకారణమని, చిరకాలం గుర్తుండిపోతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ చారిత్రక సందర్భంపై చంద్రబాబు సోమవారం స్పందిస్తూ.. అమరావతిలో మువ్వన్నెల జెండాను ఎగురవేయడం ఆనందంగా ఉందన్నారు. వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ ఎజెండాను, భవిష్యత్ కార్యాచరణను గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ స్పష్టంగా వివరించారని, ఇందుకు ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నానని ట్వీట్ చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన గ్రాండ్ పరేడ్, అందంగా తీర్చిదిద్దిన శకటాల ప్రదర్శన మన సమష్టి ఆశయాలకు, భవిష్యత్ దృష్టికి అద్దం పట్టాయని చంద్రబాబు ప్రశంసించారు. ఈ వేడుకలను వీక్షించడం ఎంతో సంతోషాన్నిచ్చిందని పేర్కొంటూ 'జైహింద్' అని తన ప్రకటనను ముగించారు.

## బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయ ట్రస్ట్ కీలక నిర్ణయం... హిందూయేతరులకు ప్రవేశం బంద్


ఉత్తరాఖండ్, జనవరి 26 : ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని శతాబ్దాల చరిత్ర కలిగిన బద్రీనాథ్, కేదార్‌నాథ్ దేవాలయాలలోకి ఇకపై హిందువులకు మాత్రమే ప్రవేశం కల్పించనున్నారు. చార్‌ధామ్ దేవాలయాలలో హిందూయేతరుల ప్రవేశాన్ని నిషేధించాలని ఆలయ నిర్వహణ సంస్థ ప్రతిపాదించింది. త్వరలో జరగబోయే కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఆలయ కమిటీ (కేబీటీసీ) బోర్డు సమావేశంలో ఈ ప్రతిపాదనలను ఆమోదించనున్నారు. కేబీటీసీ ఛైర్మన్ హేమంత్ ద్వివేది ఈ విషయంపై మాట్లాడుతూ, ఈ రెండు ఆలయాలతో పాటు కమిటీ పరిధిలోకి వచ్చే ఇతర దేవాలయాల్లోనూ ఇదే నిబంధన వర్తిస్తుందని తెలిపారు. ఇదివరకే గంగోత్రి ధామ్‌లోకి హిందూయేతరుల ప్రవేశంపై నిషేధం విధించారు. ఆదివారం జరిగిన గంగోత్రి టెంపుల్ కమిటీ సమావేశంలో దీనిపై ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో కేబీటీసీ ప్రతిపాదన కూడా వచ్చింది. అయితే ఈ నిబంధన ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుందనే విషయంపై నిర్ణయం వెలువడాల్సి ఉంది.

## భిన్నత్వంలో ఏకత్వం.. తలపాగాతో సందేశమిచ్చిన ప్రధాని మోదీ

ఢిల్లీ, జనవరి 26 (భారత శక్తి ప్రతినిధి) : భారతదేశం 77వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్న వేళ, ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి తన ప్రత్యేకమైన తలపాగాతో అందరి దృష్టిని ఆకర్షించారు. ప్రతి ఏటా గణతంత్ర దినోత్సవ వేడుకల్లో దేశంలోని ఏదో ఒక ప్రాంత సంస్కృతిని ప్రతిబింబించేలా తలపాగా ధరించడం మోదీకి అలవాటు. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ఈసారి రాజస్థానీ శైలిని పోలిన తలపాగాలో కనిపించారు. ఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకాన్ని సందర్శించిన ప్రధాని మోదీ, ఎరుపు రంగు టైడై వస్త్రంపై బంగారు జరీ వర్క్‌తో కూడిన తలపాగాను ధరించారు. సిల్క్ బ్రోకేడ్ వస్త్రంతో తయారు చేసిన ఈ తలపాగా రాజస్థానీ హస్తకళా నైపుణ్యాన్ని గుర్తుకు తెచ్చింది. దీనికి మ్యాచింగ్‌గా నీలం, తెలుపు రంగుల కుర్తా పైజామా, లేత నీలం రంగు జాకెట్‌ను ధరించారు. ప్రధాని మోదీ 2014లో అధికారం చేపట్టినప్పటి నుంచి గణతంత్ర దినోత్సవాల్లో విభిన్నమైన తలపాగాలు ధరించడం ఒక సంప్రదాయంగా మారింది. ఇవి కేవలం ఫ్యాషన్ కోసం కాకుండా, భారతదేశంలోని భిన్నత్వంలో ఏకత్వాన్ని, సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పే ప్రయత్నంగా విశ్లేషకులు భావిస్తారు. గతేడాది 76వ గణతంత్ర దినోత్సవం నాడు రాజస్థాన్, గుజరాత్‌లలో ప్రసిద్ధి చెందిన ఎరుపు, పసుపు రంగుల బాంధేజ్ తలపాగాను ధరించారు. గతంలో ఉత్తరాఖండ్ టోపీ, బహుళవర్ణ బాంధనీ ప్రింట్లు వంటివి ధరించి వివిధ రాష్ట్రాల సంస్కృతులకు గౌరవమిచ్చారు. జాతీయ యుద్ధ స్మారకం వద్ద నివాళులర్పించిన అనంతరం, ప్రధాని కర్తవ్య పథ్‌లో జరిగే పరేడ్‌ను వీక్షించడానికి చేరుకున్నారు. జాతీయ గీతం వందేమాతరం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా "వందేమాతరం 150 ఏళ్లు" అనే థీమ్‌తో ఈ ఏడాది వేడుకలను నిర్వహిస్తున్నారు.

## హార్వర్డ్ యూనివర్సిటీలో శిక్షణా తరగతులకు హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి

అమెరికా, జనవరి 26 : యూఎస్‌లోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీలోని 'కెనెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్'లో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక నాయకత్వ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ నెల 30 వరకు జరగనున్న 'లీడర్‌షిప్ ఫర్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ' పేరుతో జరుగనున్న విషయం తెలిసిందే. ఈ శిక్షణా కార్యక్రమానికి స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం మధ్యాహ్నం వెళ్లారు. తొలి రోజు పరిచయ కార్యక్రమాలతో పాటు 21వ శతాబ్దంలో నాయకత్వం కోర్సులో భాగంగా "అధికార విశ్లేషణ.. నాయకత్వం" అంశంపై తొలి సెషన్ ప్రారంభమైంది. సోమవారం ఉదయం 7 గంటల నుంచే తరగతులు మొదలయ్యాయి. ఇందులో కేస్ అనాలిసిస్, వివిధ అంశాలపై తరగతులు, కన్సల్టేటివ్ గ్రూప్ వర్క్ వంటి కార్యక్రమాల్లో సభ్యులు పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం ఆరు గంటల వరకు (స్థానిక కాలమానం ప్రకారం) తరగతులు కొనసాగనున్నాయి. మరోవైపు బోస్టన్ ప్రాంతమంతా తీవ్ర శీతాకాల




అత్యవసర పరిస్థితులు నెలకొన్నాయి. భారీ మంచు తుఫాను (ఫెర్న్) కారణంగా రెండు అడుగులకుపైగా (సుమారు 24 ఇంచులు) మంచు కురిసినట్లు సమాచారం. ఉష్ణోగ్రతలు మైనస్ 20 డిగ్రీల సెల్సియస్‌కి దిగువకు పడిపోయాయి. మొన్నటి వరకు దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొన్న విషయం తెలిసిందే. ఈ నెల 24న దావోస్ నుంచి అమెరికా బయలుదేరారు.

## కుల సంఘాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం మాజీ సర్పంచ్ సురేందర్ రెడ్డి

*** ఎం.ఎన్.ఆర్ యువసేన వ్యవస్థాపకులు నరేందర్ రెడ్డి**



గుమ్మడిదల, జనవరి 26(భారత శక్తి ప్రతినిధి) : కుల సంఘాల అభివృద్ధికి ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తామని మాజీ సర్పంచ్ ఇందుల సురేందర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఎం.ఎన్.ఆర్ యువసేన వ్యవస్థాపకులు మూడు చింతల నరేందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో ముదిరాజు సంఘం భవనం పై అంతస్తు నిర్మాణానికి కడప ఎక్కించే కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం అధ్యక్షులు కాశ బోయిన ఆంజనేయులు ఆధ్వర్యంలో కుల సంఘం పెద్దల సమక్షంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముదిరాజు కుల సంఘం అభివృద్ధి దిశగా చేపట్టిన ఈ నిర్మాణం కీలకమైన ముందడుగుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ సర్పంచ్ ఇందుల సురేందర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మూడు చింతల నరేందర్ రెడ్డి భవనం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కుల సంఘాలకు సొంత భవనాలు ఉండటం వల్ల సామాజిక ఐక్యత పెరుగుతుందని, సంఘ బలం మరింత బలపడుతుందని తెలిపారు. ముదిరాజు సంఘం భవనం పై అంతస్తు నిర్మాణం పూర్తయితే సంఘ సమావేశాలు, సామాజిక కార్యక్రమాలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ నిర్మాణానికి అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని వారు భరోసా ఇచ్చారు. కుల సంఘాల అభివృద్ధి ద్వారా గ్రామ, మున్సిపాలిటీ స్థాయిలో సామాజిక స్థిరత్వం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు నాయకులు నర్సింగ్ రావు, తులసి దాస్, వడ్డే అశోక్, మహిపాల్ రెడ్డి, ఆకుల ఆంజనేయులు, తుడుం శ్రీనివాస్, కవ్వం రవీందర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, నల్ల సురేష్ గౌడ్, నర్సింగ్ సాగర్, సంఘం నాయకులు దేవుని చెరువు నర్సింలు, జిన్నా నాగయ్య, జిన్నా మల్లేష్, కోర్పతి ఆంజనేయులు, శ్రీశైలం, విట్టల్ తదితర సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చైనా మాంజా మెడకు చుట్టుకొని బైక్‌పై వెళ్తున్న ఐదేళ్ల బాలిక మృతి

హైదరాబాద్, జనవరి 26(భారత శక్తి ప్రతినిధి) : నిషేధిత చైనా మాంజా మరో నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. సంక్రాంతి పండుగ వేళ గాలిపటాలు ఎగురవేసేందుకు వాడే ఈ ప్రమాదకరమైన దారం, ప్రయాణికులకు శాపంగా మారుతోంది. సోమవారం సాయంత్రం కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ విషాద ఘటన చోటు చేసుకుంది.

**తండ్రి కళ్ల ముందే కూతురు మృతి**

సంగారెడ్డి జిల్లా కాజీపల్లికి చెందిన ఒక వ్యక్తి తన ఇద్దరు కుమార్తెలతో కలిసి బైక్‌పై కూకట్‌పల్లి వైపు వెళ్తున్నారు. వివేకానంద నగర్ లోని హైవే వద్దకు చేరుకోగానే, గాలిలో నుంచి తెగి పడిన చైనా మాంజా ఐదేళ్ల బాలిక నిష్విక ఆదిత్య మెడకు చుట్టుకుంది. దారం మెడకు బలంగా దిగబడటంతో తీవ్ర గాయమై బాలిక బైక్ పై నుంచి కిందపడిపోయింది. గొంతు వద్ద తీవ్రమైన కోత పడటంతో విపరీతంగా రక్తస్రావం జరిగి, బాలిక తన తండ్రి కళ్ల ముందే ప్రాణాలు వదిలింది.

# వ్యాపారమే పరమావధి.. ప్రాణాలకు లేదు రక్షాకవచం!

- నాంపల్లి అగ్నిప్రమాదం వెనుక అక్రమాల గుట్ట..
- షోరూం యజమాని అరెస్ట్
- మృత్యు కుహరాలుగా మారుతున్న వాణిజ్య సముదాయాలు..
- అధికారుల అవినీతే శాపమా?

పరిశోధనాత్మక పాత్రికేయులు వీ.జీ. (వేణుగోపాల్)




**హైదరాబాద్, జనవరి 26 (భారత శక్తి ) :** నాంపల్లి అగ్నిప్రమాదం వెనుక అక్రమాల గుట్ట : నిబంధనలు 'బూడిద'.. లంచాలదే 'హవా'...

రాజధాని నగరంలో మరోసారి అగ్నిప్రమాదం ఐదు ప్రాణాలను బలితీసుకుంది. నాంపల్లిలోని బచ్చాస్ ఫర్నీచర్ షోరూమ్‌లో సంభవించిన ప్రమాదం కేవలం 'ప్రమాదం' కాదు, అది నిబంధనల ఉల్లంఘనలతో జరిగిన 'నేరపూరిత హత్య'గా పోలీసులు నిర్ధారించారు. పార్కింగ్ కోసం కేటాయించిన సెల్లార్‌ను గోడౌన్‌గా మార్చి, రసాయనాలు నింపిన యజమాని స్వార్థం ఐదుగురిని సజీవ దహనం చేసింది. అక్రమ కట్టడాలు, ఇరుకైన సందుల్లో ఆరంతస్తుల భవనాలు వెలుస్తున్నా కళ్లు మూసుకుంటున్న పురపాలక, అగ్నిమాపక అధికారుల తీరుపై ఇప్పుడు సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కటకటాల్లో యజమాని.. హంతక సెక్షన్లతో కేసు

షోరూం యజమాని సతీష్ బచ్చాను అబిడ్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వల్ల జరిగిన ప్రాణనష్టాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయనపై భారతీయ న్యాయ సంహిత (BNS) సెక్షన్ 110 (నేరపూరిత నరహత్యకు ప్రయత్నం) కింద కేసు నమోదు చేశారు. సెల్లార్‌లో ఫర్నీచర్‌తో పాటు అగ్గిని రాజేసే కెమికల్స్ నిల్వ చేయడం, సిబ్బందికి అక్కడే వసతి కల్పించడం పెను ప్రమాదానికి దారితీసింది.

**అనుమతులు ఇలా.. అక్రమాలు అలా!**

ఒక వాణిజ్య భవనం నిర్మించాలంటే ఉండాల్సిన కనీస నిబంధనలు గాలికి ఎగురుతున్నాయి.

**పార్కింగ్ మాయం:**

అనుమతుల్లో సెల్లార్‌ను పార్కింగ్‌కు చూపిస్తున్న యజమానులు, నిర్మాణం పూర్తయ్యాక దానిని వ్యాపారాలకు వాడుకుంటున్నారు.

**సెట్ బ్యాక్స్ లేవు:**

భవనం చుట్టూ అగ్నిమాపక శకటం తిరిగేందుకు ఖాళీ స్థలం (Setbacks) ఉండాలి. కానీ, అంగుళం కూడా వదలకుండా ఐదారు అంతస్తులు నిర్మిస్తున్నారు.

**ఇరుకైన దారులు:**

ఇరుకు సందుల్లో భారీ షాపింగ్ మాల్స్ నిర్మిస్తున్నా అధికారులు మౌనంగా ఉంటున్నారు.

లోతైన సెల్లార్లు: అనుమతులు లేకుండానే అదనపు సెల్లార్లు తవ్వుతూ పక్క భవనాల భద్రతను సైతం ముప్పులో పడేస్తున్నారు.




**ఫైర్ ఎన్‌వోసీల విక్రయం?**

నిబంధనల ప్రకారం 15 మీటర్ల కన్నా ఎక్కువ ఎత్తున్న వాణిజ్య భవనాలకు ఫైర్ ఎన్‌వోసీ (NOC) తప్పనిసరి. కానీ, క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే అగ్నిమాపక అధికారులు అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.


అవినీతికి ఆస్కారం: ఫైర్ సేఫ్టీ పరికరాలు లేకున్నా, కేవలం పత్రాల మీద ఉన్నాయని చూపిస్తూ 'ముడుపుల' మత్తులో అధికారులు క్లియరెన్స్ ఇస్తున్నారు.

తనిఖీల ప్రహసనం: ఏటా జరగాల్సిన ఫైర్ ఆడిట్ కేవలం మొక్కుబడిగా సాగుతోంది. ప్రమాదం జరిగినప్పుడు మాత్రమే అధికారులు హడావుడి చేసి మౌనంగా ఉండిపోతున్నారు.

**తీసుకోవాల్సిన రక్షణ చర్యలు ఇవే..**

అగ్నిమాపక వ్యవస్థ: ప్రతి అంతస్తులో ఫైర్ స్ప్రింక్లర్లు, స్మోక్ డిటెక్టర్లు, ఫైర్ ఎక్స్‌టింగూషర్లు ఉండాలి.

అత్యవసర ద్వారాలు: అగ్నిప్రమాదం జరిగినప్పుడు బయటకు వెళ్లేందుకు 'ఎమర్జెన్సీ ఎగ్జిట్' ద్వారాలు తప్పనిసరి. ఇవి సామానుతో నిండి ఉండకూడదు.




నీటి నిల్వ: భవనం పైన లేదా కింద అగ్నిమాపక అవసరాల కోసం ప్రత్యేక వాటర్ ట్యాంక్ ఉండాలి.

విద్యుత్ ఆడిట్: పాత భవనాల్లో వైరింగ్ మార్చక పోవడం వల్ల షార్ట్ సర్క్యూట్లు జరుగుతున్నాయి. క్రమం తప్పకుండా ఎలక్ట్రికల్ ఆడిట్ చేయాలి.

**కఠిన చర్యలు తీసుకుంటేనే మార్పు!**

అక్రమ కట్టడాలకు సహకరించే టౌన్ ప్లానింగ్ అధికారులు, ముడుపులు తీసుకునే ఫైర్ ఆఫీసర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. పార్కింగ్ లేని భవనాలను సీజ్ చేయడంతో పాటు, అనుమతులు లేని అంతస్తులను కూల్చివేయాలి. అప్పుడే అమాయకుల ప్రాణాలు గాలిలో కలవకుండా ఉంటాయి.

## పీసీసీ చీఫ్ మాటలు 'ఉల్టా పుల్టా'.. పాండురంగారెడ్డి ఫైర్!



హైదరాబాద్, జనవరి 26 (భారత శక్తి ) : "చెప్పేటోనికి వినేటోడు లోకువైనట్టుంది మహేష్ కుమార్ గౌడ్ తీరు" అంటూ తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి ఓ రేంజ్‌లో విరుచుకుపడ్డారు. ఎమ్మెల్సీ కవిత కాంగ్రెస్‌లోకి వస్తానంటే తానే వద్దన్నానంటూ పీసీసీ ప్రెసిడెంట్ చేసిన కామెంట్లను ఆయన తీవ్రంగా ఖండించారు. ఆదివారం ప్రెస్‌నోట్ రిలీజ్ చేసిన ఆయన.. కాంగ్రెస్ సర్కార్ తీరుపై, మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలపై నిప్పులు చెరిగారు.

- **గ్యారెంటీలు గాలికి.. గప్పాలకే ప్రాధాన్యం!**

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ వచ్చి ఏడాదవుతున్నా, ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక చేతులెత్తేసిందని పాండురంగారెడ్డి ఎద్దేవా చేశారు. "పైసల్లేక ఖజానా ఖాళీ అయింది.. జనాల నుంచి తిరుగుబాటు మొదలైంది. ఈ తిప్పల నుంచి తప్పించుకోవడానికే కొత్త డ్రామాలకు తెరలేపారు" అని మండిపడ్డారు. ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇట్లాంటి పల్టీ మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు.

- **'జాగృతి'ని చూస్తే వణుకు పుడుతోందా?**

తెలంగాణ జాగృతి త్వరలోనే రాజకీయ పార్టీగా రాబోతుండటంతో కాంగ్రెస్ నాయకులకు నిద్ర పట్టడం లేదని ఆయన అన్నారు. "జాగృతికి వస్తున్న జనం, ఆదరణ చూసి మహేష్ కుమార్ గౌడ్‌కు భయం పట్టుకుంది. అందుకే ఇట్లాంటి సత్యదూరమైన మాటలు మాట్లాడుతుండు. సొంత పార్టీల ఉన్న లొల్లిని సెట్ చేసుకోలేక, నాయకులను కలుపుకోలేక సతమతమవుతున్న పీసీసీ చీఫ్.. ఇంకొకరి గురించి మాట్లాడటం హాస్యాస్పదం" అని చురకలంటించారు.

- **బురద రాజకీయాలు బంద్ చెయ్యి..**

తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి, ప్రత్యర్థులపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ తన ఉనికిని కాపాడుకోవడానికి పడుతున్న ఆరాటం తెలంగాణ ప్రజలందరికీ తెలుసన్నారు. "ఇకనైనా ఇట్లాంటి చౌకబారు మాటలు మానుకోకపోతే జనం బుద్ధి చెప్తారు. జాగృతి నైతిక బలాన్ని దెబ్బతీయాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదు" అని పాండురంగారెడ్డి గట్టిగా హెచ్చరించారు.

## పట్టుదలతో చదివి లక్ష్యాన్ని సాధించాలి

- **గణతంత్ర వేడుకల్లో మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్**
- **సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటేనే మంచి ర్యాంకులు**




చైతన్యపురి, జనవరి 26 (భారత శక్తి) : విద్యార్థులు తమ లక్ష్య సాధనలో ఎదురయ్యే ఆటంకాలకు నిరుత్సాహం చెందకుండా, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పిలుపునిచ్చారు. చైతన్యపురిలోని అపోలో అకాడమీలో నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు.

**:ఆత్మన్యూనత వీడాలి:**

ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ప్రతిభ ఉన్న వారికి ప్రస్తుత కాలంలో అపారమైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. తాను కూడా వైద్యుడు కావాలని ఆశించి, చివరికి న్యాయవాద వృత్తిని ఎంచుకున్నానని తన అనుభవాన్ని పంచుకున్నారు. "తెలుగు మీడియం విద్యార్థులమని ఎవరూ ఆత్మన్యూనతకు గురికావద్దు. నేను కూడా తెలుగు మీడియంలోనే చదివి న్యాయవాదిగా ఎదిగాను" అని ఆయన ధైర్యాన్ని నింపారు.

**రీల్స్‌కు దూరంగా ఉండండి:**

నేటి తరం విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా సెల్‌ఫోన్లు, సోషల్ మీడియా రీల్స్‌కు దూరంగా ఉంటేనే ఉత్తమ ర్యాంకులు సాధించగలరని సూచించారు. చదువుతో పాటు మానసిక ఉల్లాసం కోసం క్రీడలు, యోగా, జిమ్ వంటి వ్యాయామాల్లో పాల్గొనాలన్నారు. అకాడమీ యాజమాన్యం విద్యార్థులను ఆ దిశగా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు చైతన్యపురి డివిజన్ అధ్యక్షుడు బండ సురేందర్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి, నాయకులు శ్రీపాల్ రెడ్డి, వేణుగోపాల్ యాదవ్, చెన్నగోని రవీందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, బుడ్డ సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే అపోలో మెడికల్ అకాడమీ డైరెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ మధుసూదన్ రెడ్డి, రమాకాంత్, రాహుల్ జైన్, నాగార్జున రెడ్డి, నవీన్ చారి, పాశం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మాత వాసవి పూజా కార్యక్రమంలో పాల్గొన్న కళ్లెం నవజీవన్ రెడ్డి



ఎల్బీనగర్, జనవరి 20 (భారత శక్తి): మాత వాసవి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా హయత్ నగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ధర్మం, సత్యం, త్యాగానికి ప్రతీక అయిన మాత వాసవి దేవి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. సమాజహితాన్ని కాంక్షిస్తూ మాత వాసవి చేసిన ఆత్మార్పణ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, నైతిక విలువలను పెంపొందిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో హయత్ నగర్ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, సంఘ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ ముద్దు.లచిరెడ్డి..




వనస్థలిపురం, జనవరి 26 (భారత శక్తి) : దేశ వ్యాప్తంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ పరిధిలో పలుచోట్ల జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, డివిజన్‌లోని సుమారు 14 ప్రాంతాలలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.

**అభివృద్ధికి బాటలు వేయడమే లక్ష్యం:**

ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డివిజన్ ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. రాజీవ్ గాంధీ పార్క్ (NGOs కాలనీ), దుర్గా సాయి నగర్, శ్రీరామ్ నగర్, సాహెబ్ నగర్ ప్రభుత్వ పాఠశాలలు, వైదేహి నగర్, సాయిరాం కాలనీ, శ్రీపురం కాలనీ వంటి పలు చోట్ల ఆయన జెండా ఆవిష్కరించారు. అలాగే ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లోనూ ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నేతలు పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శులు గంగం ప్రేమ్ నాథ్, విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు పవన్ రెడ్డి, OBC మోర్చా అధ్యక్షుడు మహేష్ గౌడ్, సీనియర్ నాయకులు ప్రభాకర్ యాదవ్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే యువజన విభాగం నుంచి BJYM అధ్యక్షుడు సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి అఖిల్ గౌడ్, ఎస్సీ మోర్చా నుంచి దుర్గా ప్రసాద్, ఠాగూర్, మనోజ్ కుమార్, సాయిరాంలతో పాటు ఆయా కాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.